విశాఖపట్టణం
శనివారం 5 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 204 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## స్థానికానికి ముందడుగు

వార్డుల పునర్విభజనకు టైమ్ లైన్

15వ నాటికి డిలిమిటేషన్ ప్రక్రియ పూర్తి

ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం



2



## ఎవరు మేయర్!

అభ్యర్థి కోసం పార్టీల వేట

తామే దిగుతామంటున్న ఎమ్మెల్యేలు

వారసులకు ఛాన్స్ కోసం ఇంకొందరు యత్నాలు

ఆర్థిక, అంగ బలం కోసం ఆరా

కసరత్తు చేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలు

(విశాఖపట్నం - జయజయహే)

గ్రేటర్ విశాఖ మేయర్ పీఠం అంటే ఇప్పటి వరకు హాట్ సీట్ గా ఉండేది. ఇప్పుడు స్వీట్ సీటుగా మారిపోయింది. పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులకు, పదవులు లేక ఖాళీగా ఉన్న సీనియర్ల పొలిటీషన్లకు ఇదే సీటుపై కన్నేస్తున్నారు. చివరకు ఎమ్మెల్యే పదవులను సైతం తృణప్రాయంగా వదిలేసి, మేయర్ సీటు ఎక్కేయడానికి రెడీ అవుతున్నారు. ఇంతకీ గ్రేటర్ మేయర్ సీటులో ఏముంది..? మేయర్ పీఠంపై నేతలకు ఎందుకంత ప్రేమ..? ఏయే పార్టీల నుంచి ఎవరెవరు రేసులో ఉన్నారు..? ఇదీ.. అసలు కథ.. ..మిగతా 2లో

# పుష్కర కాలం నుంచి కాలుష్యం

స్థానిక సంస్థల ట్యాక్స్‌లు ఎగ్గొడుతున్నారు

నోటీసులు ఇస్తే కోర్టులకెక్కి కాలయాపన

రాజమహేంద్రవరంలో సగం వ్యర్థాలు మీ వల్లే

బకాయి రూ. 21.34 కోట్లు చెల్లించాల్సిందే

ఆంధ్రా పేపర్ మిల్స్ పై డిప్యూటీ సీఎం పవన్ ధ్వజం





(అమరావతి - జయజయహే)

రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్ యథేచ్ఛగా కాలుష్యాన్ని వెదజల్లుతూ, పన్నులు చెల్లించకుండా తీవ్ర బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాదాపు పుష్కరకాలం నుంచి స్థానిక సంస్థలకు రూ. 21.34 కోట్ల వరకు పన్నులు ఎగ్గొడుతూ, నోటీసులు ఇచ్చిన ప్రతిసారీ కోర్టులను ఆశ్రయించి టైం వేస్ట్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. 2016 తర్వాత కాతేరు గ్రామ పంచాయతీకి గానీ, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు గానీ ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాజమహేంద్రవరంలో ఉత్పత్తయ్యే మొత్తం 70 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్థాలలో సగం, అంటే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలను ఒక్క ఆంధ్రా పేపర్స్ పరిశ్రమే విడుదల చేస్తోందని పవన్ కళ్యాణ్ తెలిపారు ఈ పరిశ్రమ విడుదల చేసే నీటిలో బయో కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ నిర్ణీత ప్రమాణాల కంటే 20 శాతం, ఫాస్ఫేట్ 6 శాతం, సల్ఫైడ్స్ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కంటే ఏకంగా 70 శాతం అధికంగా ఉన్నాయని పరీక్షల్లో నిర్ధారణ అయిందన్నారు. దీనివల్ల గోదావరి నదిలో ఆక్సిజన్ శాతం తగ్గి జలచరాలు, పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటున్నాయని, భూగర్భ జలాలు కలుషితమై స్థానిక ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను సరిదిద్దుకునేందుకు కూటమి ప్రభుత్వం ముందస్తుగా షోకాజ్ నోటీసులు ..మిగతా 2లో

# ఫిబ్రవరి వరకు ఎల్ నినో పంజా

ఆగస్టులో 16శాతం తక్కువ వర్షపాతం

తగ్గిపోనున్న శీతాకాలం

వ్యవసాయ రంగానికి గండం

ఆహార భద్రతకు ముప్పు

భారత వాతావరణ సంస్థ విశ్లేషణ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్ నినో' పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చి, ఫిబ్రవరి 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం పడవచ్చునని పేర్కొంది. అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా తలెత్తవచ్చని ఆ సంస్థ వెల్లడించింది. గురువారం డబ్ల్యూఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్టే సాలో ఎల్‌నినో పై కీలక విషయాలు వెల్లడించారు. "స్పానిష్ భాషలో 'ఎల్ నినో' అంటే చిన్నపిల్లవాడు అని అర్థం. కానీ ఇది ప్రపంచ ..మిగతా 2లో

# మళ్లీ కలెక్టర్ల సదస్సు

10, 11 తేదీల్లో నిర్వహణ

కీలకాంశాలపై సమీక్ష చేయనున్న సీఎం

(అమరావతి - జయజయహే)



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 8వ కలెక్టర్ల సదస్సు నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 10, 11వ తేదీల్లో ఈ సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. తొలి రోజు గత సదస్సు నిర్ణయాల అమలుపై సమీక్షించనున్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, జిల్లా వారీ లక్ష్యాలపై కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. స్వర్ణ ఆంధ్ర--2047 జిల్లా రోడ్‌మ్యాప్‌లపై ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించనున్నారు. ఆరోగ్యం, విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్లతో సీఎం ..మిగతా 2లో




## సైబర్ ముఠాలపై సీబీఐ కొరడా

'ఆపరేషన్ చక్ర-VI' పేరిట దాడులు

ఏకకాలంలో 20 రాష్ట్రాల్లో తనిఖీలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'డిజిటల్ అరెస్ట్' సైబర్ నేరాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ చక్ర-ఎ×' లో భాగంగా 20 రాష్ట్రాల్లోని 89 ప్రాంతాల్లో సీబీఐ ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టింది. సైబర్ బాధితుల నుంచి కొల్లగొట్టిన సొమ్మును స్వీకరించడం, దారి మళ్లించడం, పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు నిందితులను సీబీఐ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు, ప్రభుత్వ అధికారులమని చెప్పి నకిలీ గుర్తింపు కార్డులు చూపి జనాల్ని డిజిటల్ అరెస్టులు చేస్తూ ఈ సైబర్ ముఠాలు అనేక ..మిగతా 2లో

# ఇస్రో మరో విజయం

జీఓఎస్ -05 ప్రయోగం సక్సెస్

రక్షణ, విపత్తు రంగాలకు ప్రయోజనం

(తిరుపతి - జయజయహే)



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో విజయాన్ని అందుకుంది. రక్షణ, విపత్తు నిర్వహణ రరంగాల్లో అత్యంత కీలకమైన ఈఓఎస్-05 (జీశాట్ 1ఏ) శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించింది సత్తా చాటింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) రెండవ ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్17 వాహకనౌక నింగిలోకి దూసుకెళ్ళింది. సరిగ్గా 18 నిమిషాల వ్యవధిలో అంటే 3 గంటల 13 నిమిషాలకు 2,367 కేజీల బరువున్న జీశాట్ 1ఏ ఉపగ్రహాన్ని రాకెట్ అత్యంత కచ్చితత్వంతో సబ్-జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువు కలిగిన ఈ రాకెట్‌తో చేపట్టిన ఇస్రో శాస్త్రవేత్తలు జీఎస్ఎల్వీ సిరీస్‌లో చేసిన 19వ ప్రయోగం ఇది అని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహం భూస్థిర కక్ష్యలో ఉంటూనే మొత్తం దక్షిణాసియాను ..మిగతా 2లో



## దుర్గమ్మ సన్నిధిలో విషాదం

దర్శనానికి వచ్చిన భక్తురాలు మృతి

2

# అశోక్ గజపతి స్థల వివాదంపై విచారణ

వైసీపీ కార్యాలయం నిర్మాణంపై ఫిర్యాదు

వారంలోగా నివేదికివ్వాలని ప్రభుత్వ ఆదేశం

(అమరావతి - జయజయహే)



గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజు స్థలం వివాదంపై విచారణకు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విజయనగరం మున్సిపల్ పరిధిలోని మహారాజుపేట సౌత్ వార్డులో టౌన్ సర్వే నెంబర్ 569 లో 4 ఎకరాల 74 సెంట్లలో.. ఎకరా స్థలంలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మించింది. ఈ వ్యవహారాన్ని అశోక్ గజపతిరాజు వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తన స్థలంలో అక్రమంగా వైసీపీ కార్యాలయ నిర్మాణం చేపట్టారంటూ గత ఏడాది ..మిగతా 2లో

# ఎవరు మేయర్!

మొదటి పేజీ తరువాయి...

గ్రేటర్ విశాఖ మేయర్ ఎన్నిక ప్రత్యక్ష విధానంలో జరగనుందన్న నిర్ణయంతో నగర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ఇప్పటివరకు పరోక్ష పద్ధతిలో మేయర్‌ను ఎన్నుకునే విధానం ఉండగా.. ఇకపై ప్రజలే నేరుగా మేయర్‌ను ఎన్నుకునే అవకాశం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలకు తెరతీస్తోంది. ముఖ్యంగా ఏపీలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న గ్రేటర్ విశాఖ మేయర్ పదవిపై అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీలో ఆసక్తికరమైన చర్చలు సాగుతున్నాయి. మేయర్ పదవి అంటే కేవలం ప్రొటోకాల్ హోదా మాత్రమే కాదని.. ప్రత్యక్ష ఎన్నికల నేపథ్యంలో విస్తృతమైన రాజకీయ ప్రాధాన్యం, ప్రజా మద్దతు, నగర పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో ఇప్పటివరకు అసెంబ్లీ రాజకీయాల్లో ఉన్న కొందరు సీనియర్ నేతలు సైతం మేయర్ రేసుపై ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం విశాఖ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

సిట్టింగ్ ఎమ్మెల్యేలు మేయర్ పదవిపై ఎందుకు ఆసక్తి చూపుతున్నారన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. విశాఖ నగరం భవిష్యత్తులో మరింత విస్తరించబోతోందన్న అంచనాలు దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు ఎంపీ నియోజకవర్గాలు ఉన్నాయి. భోగాపురం విమానాశ్రయం, విశాఖ నగరం మధ్య ఐటీ, డేటా ఆధారిత పరిశ్రమలు, భారీ పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో నగరం ఆర్థికంగా మరింత కీలకంగా మారనుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో ఆనందవరం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాలను విశాఖ నగరంలో విలీనం చేసే ప్రక్రియపై గ్రామసభల ద్వారా తీర్మానాలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ విలీన ప్రక్రియ పూర్తయితే జీవీఎంసీ పరిధిలో డివిజన్ల సంఖ్య 150 వరకు పెరిగే అవకాశం ఉందన్న చర్చ కూడా ఉంది. ప్రస్తుతం గ్రేటర్ విశాఖ బడ్జెట్ రూ.4 వేల కోట్లకు పైగానే ఉందన్నది మరో కీలక అంశం. ఇంత భారీ




ఆర్థిక వనరులతో పనిచేసే నగర పాలక సంస్థకు ప్రత్యక్షంగా ఎన్నికయ్యే మేయర్ రాజకీయంగా అత్యంత కీలకమైన వ్యక్తిగా మారే అవకాశం ఉందని నేతలు భావిస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్‌కు నగరవ్యాప్తంగా ప్రజల నుంచి నేరుగా మద్దతు లభిస్తుంది. దీంతో మేయర్ పదవి భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నప్పటికీ మేయర్ సీటుపై కొందరు అధికార కూటమి పార్టీల నేతలు కన్నేస్తున్నారు. అధికార టీడీపీకి చెందిన కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు మేయర్ పదవిపై ఆసక్తి చూపుతున్నారన్న ప్రచారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. విశాఖ తూర్పు నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్లు మేయర్ రేసులో వినిపిస్తున్నాయి. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవింద్, గండి బాబ్జి పేర్లపైనా చర్చ జరుగుతున్నట్టు సమాచారం. వైసీపీలోనూ మాజీ ఎమ్మెల్యేల పేర్లు తెరపైకి వస్తున్నాయి. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వాసుపల్లి గణేష్‌కుమార్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశిస్తే మేయర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన సంకేతాలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మరో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ పేరు కూడా పార్టీలో చర్చకు వస్తున్నట్టు సమాచారం. అయితే వైసీపీ నుంచి కూడా ఇప్పటివరకు అధికారికంగా మేయర్ అభ్యర్థిని ప్రకటించలేదు. ఇక మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు సంబంధించిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత ఊతమిచ్చాయి. ఆయన కుమారుడు మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తారా అని మీడియా ప్రశ్నించిన సమయంలో "ఏం.. నేను కాకూడదా?" అన్నట్లుగా ఆయన స్పందించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఈ వ్యాఖ్యను గంటా సరదాగా చేశారా? లేక మేయర్ ఎన్నికపై ఆయనకున్న ఆసక్తిని సూచించారా? అన్న దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు కొందరు సీనియర్ నేతలు తమ రాజకీయ వారసుల కోసం కూడా మేయర్ అవకాశాలను పరిశీలిస్తున్నారన్న ప్రచారం ఉంది. తాము మేయర్‌గా ఎన్నికైతే.. తమ వారసులకు అసెంబ్లీ రాజకీయాల్లోకి రావడానికి అవకాశం కల్పించవచ్చని కొందరు నేతలు భావిస్తున్నట్టు సమాచారం. మేయర్ పదవి ద్వారా వారసులకు నగర పాలనపై అనుభవం వస్తుందని, పార్టీ అధిష్ఠానంతో నేరుగా సంబంధాలు ఏర్పడే అవకాశం ఉంటుందని నేతలు లెక్కలు వేసుకుంటున్నారన్న చర్చ కూడా ఉంది. మొత్తంగా ప్రత్యక్ష మేయర్ ఎన్నికల నిర్ణయం విశాఖలో కొత్త రాజకీయ సమీకరణాలకు కారణమవుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాజకీయ వారసులు.. ఇలా మేయర్ పదవిపై అనేక పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. అయితే తుది నిర్ణయం మాత్రం ఆయా పార్టీల అధిష్ఠానాలదే. ఎవరు అధికారికంగా మేయర్ రేసులో నిలబడతారు? సిట్టింగ్ ఎమ్మెల్యేలు నిజంగానే ఎమ్మెల్యే పదవిని వదులుకుని మేయర్ ఎన్నికలోకి వస్తారా? లేక తమ వారసులను బరిలోకి దింపుతారా? అన్నది రానున్న రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. విశాఖ మేయర్ పీఠం.. ఇప్పుడు నగర రాజకీయాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది.



# దుర్గమ్మ సన్నిధిలో విషాదం

## దర్శనానికి వచ్చిన భక్తురాలు మృతి

(విజయవాడ - జయజయహే)

ఇంద్రకీలాద్రిపై విషాదం చోటుచేసుకుంది. కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చిన ఒక మహిళా భక్తురాలు తీవ్ర అస్వస్థతకు గురై మార్గంమధ్యలో మృతి చెందారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడప గ్రామానికి చెందిన కె. పద్మ అనే 61 ఏళ్ల వృద్ధురాలు తన భర్త నాంచారయ్యతో కలిసి దుర్గమ్మ దర్శనం కోసం కొండపైకి వచ్చారు. ఆలయంలో దర్శనం పూర్తయిన అనంతరం, అన్నప్రసాదం స్వీకరించడం కోసం మహామండపం రెండో అంతస్తుకు వెళ్లేందుకు వారు లిఫ్ట్ వద్దకు చేరుకున్నారు. తమను రెండో అంతస్తులో దింపాలని కోరినప్పటికీ, లిఫ్ట్ సిబ్బంది వారిని గ్రౌండ్ ఫ్లోర్‌లోనే దింపి.. మెట్ల మార్గంలో పైకి వెళ్లాలని సూచించారు. దీంతో మెట్లు ఎక్కుతున్న క్రమంలో పద్మ తీవ్ర అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన ఆలయ సిబ్బంది వెంటనే ఆమెను గ్రౌండ్ ఫ్లోర్‌కు తీసుకువచ్చి, దేవస్థానం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే యత్నం చేశారు. అయితే మార్గమధ్యలోనే ఆమె మృతిచెందడంతో దుర్గమ్మ సన్నిధిలో విషాదం నెలకొంది. ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు శుక్రవారం ఉదయం భారీగా తరలివచ్చారు. శ్రావణ మాసంలో చివరి శుక్రవారం కావడంతో దుర్గమ్మను దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చి క్యూలైన్లలో బారులు తీరారు. ప్రత్యేక పూజలు, దర్శనాల కోసం వచ్చిన భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. దర్శనం కోసం ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దుర్గగుడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం నిరంతరాయంగా మంచి నీళ్లు, ఇతర ప్రాథమిక సదుపాయాలను భక్తులకు కల్పించారు.

# స్థానికానికి ముందడుగు

(అమరావతి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల దిశగా మరో కీలక ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికల నేపథ్యంలో వార్డుల పునర్విభజనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల హద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియను పూర్తి చేసేందుకు మున్సిపల్ శాఖ టైమ్‌లైన్ రూపొందించింది. మొత్తం 39 పట్టణ స్థానిక సంస్థల్లో దశలవారీగా డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. మొదటి దశలో 26 పట్టణ స్థానిక సంస్థల్లో డీలిమిటేషన్ ప్రక్రియకు సెప్టెంబర్ 3ను గడువుగా నిర్ణయించారు. పార్వతీపురం, సాలూరు, నర్సీపట్నం, విజయవాడ, రామచంద్రాపురం, జగ్గయ్యపేట, మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి, మార్కాపురం, చీరాల, చిత్తూరు, అనంతపురం, కర్నూలు తదితర పట్టణాలు ఇందులో ఉన్నాయి. తొలి విడతలో తిరుపతి సహా మరిన్ని పట్టణాలు కూడా ఉన్నాయి. వాటిలో ప్రొద్దుటూరు, రాయచోటి, రాయదుర్గం, పుట్టపర్తి, బద్వేల్, నగరి, పుత్తూరు, కదిరి, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, పలమనేరు, తిరుపతి వంటి పట్టణాల్లోనూ సెప్టెంబర్ 3 నాటికి వార్డుల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేసేలా షెడ్యూల్‌లో పేర్కొన్నారు. రెండో దశలో సెప్టెంబర్ 8 కీలకంగా మారింది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏలూరు, మచిలీపట్నం, పెడన, పిఠాపురం, ఒంగోలు, గుంటూరు, కడప, ధర్మవరం, తాడిపత్రి, నంద్యాలల్లో ఆ తేదీ నాటికి డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఇక మూడో దశలో చిలకలూరిపేట, నెల్లూరు పట్టణ స్థానిక సంస్థల్లో సెప్టెంబర్ 15 నాటికి వార్డుల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. దీంతో 39 పట్టణ స్థానిక సంస్థల్లో డీలిమిటేషన్ ప్రక్రియను దశలవారీగా పూర్తి చేసేలా మున్సిపల్ శాఖ కార్యాచరణ రూపొందించింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వార్డుల పునర్విభజన ప్రక్రియ కీలకంగా మారింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక ప్రక్రియల్లో వార్డుల హద్దుల నిర్ణయం ముఖ్యమైన అంశం కావడంతో.. 39 పట్టణ స్థానిక సంస్థల్లో డీలిమిటేషన్‌ను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసే దిశగా మున్సిపల్ శాఖ ముందుకు సాగుతోంది. మొత్తంగా 39 పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియను మూడు దశల్లో పూర్తి చేయాలని షెడ్యూల్ ఖరారైంది. తొలి దశకు సెప్టెంబర్ 3, రెండో దశకు సెప్టెంబర్ 8, చివరి దశకు సెప్టెంబర్ 15ను గడువుగా నిర్ణయించారు. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవుతున్న కొద్దీ స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లలో తదుపరి ప్రక్రియలకు మార్గం సుగమం కానుంది.

# పుష్కర కాలం నుంచి కాలుష్యం

మొదటి పేజీ తరువాయి...

ఇచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల ద్వారా పలుమార్లు చర్చలు జరిపినప్పటికీ పరిశ్రమ యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందనా లేదని ఆయన తెలిపారు. నిబంధనల ప్రకారం పరిశ్రమ కార్యకలాపాలను నిలిపివేయడం, సీజ్ చేయడం లేదా లైసెన్స్ రద్దు చేసే అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించిందని, ఇకపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్స్ లిమిటెడ్‌కి సమన్స్ జారీ చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ ఉల్లంఘనలపై కోర్టులలో ఉన్న కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అడ్వకేట్ జనరల్, ప్రభుత్వ న్యాయవాదులకు డిప్యూటీ సీఎం సూచించారు. 'స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాలు' థీమ్‌తో గోదావరి నదిని కాలుష్యం నుంచి కాపాడుకునేందుకు పర్యావరణ వేత్తలు, పౌర సమాజం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని పవన్ కళ్యాణ్ పునరుద్ఘాటించారు.

# ఇస్రో మరో విజయం

మొదటి పేజీ తరువాయి...



ఒకే ఫ్రేమ్‌లో, ప్రతి 10 నిమిషాలకు ఒకసారి భారత ఉపఖండాన్ని మొత్తం ఫొటో తీయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. సాధారణంగా సన్ సింక్రోనస్ ఆర్బిట్, లో ఎర్త్ ఆర్బిట్‌లో ఉండే ఉపగ్రహాలు ఒక ఏరియాను ఫొటో తీసేందుకు రోజుల నుంచి వారాలపాటు టైమ్ తీసుకుంటాయి. లేటెస్ట్ శాటిలైట్ మాత్రం నిమిషాల వ్యవధిలో అద్భుతమైన ఫొటోలు తీయగలదు. ఇందులో అమర్చిన ఎంఎక్స్–వీఎన్‌ఆర్ పేలోడ్ ఒక పిక్సెల్‌కు 42 మీటర్ల స్పేషియల్ రిజల్యూషన్‌ను అందిస్తుంది. భూస్థిర కక్ష్యలో ఇంతటి అత్యుత్తమ రిజల్యూషన్ కలిగిన కెమెరాను కలిగిన ప్రపంచంలోనే తొలి ఉపగ్రహంగా ఈఓఎస్ 05 శాటిలైట్ నిలిచింది. ప్రస్తుతం ఉన్న ఇస్రో సామర్థ్యం కంటే దీని పిక్సెల్ డెన్సిటీ 567 రెట్లు మెరుగ్గా ఉంటుంది.

### రక్షణ, విపత్తు రంగాలకు కీలకమైన ప్రయోగం

ఇస్రో చేసిన ఈ తాజా ప్రయోగం దేశ భద్రత, విపత్తుల నిర్వహణలో గేమ్ ఛేంజర్‌గా మారనుందని చెప్పవచ్చు. సరిహద్దుల్లో శత్రు దేశాల సైనిక స్థావరాలను అత్యంత సులువుగా పసిగట్టడంతో పాటు, వరదలు, తుపాన్లు, కార్చిచ్చుల వంటి విపత్తుల తీవ్రతను రియల్–టైమ్‌లో అంచనా వేయడానికి శాటిలైట్ తోడ్పడుతుంది. అలాగే పంటల ఆరోగ్యం, అటవీ ప్రాంతాలు, నీటి వనరులలో కాలుష్యం, ఖనిజ సంపద వివరాలను దీనిలోని హైపర్, మల్టీ స్పెక్ట్రల్ కెమెరాలు గుర్తించి వివరాలు అందిస్తాయని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2021 ఆగస్టులో చేసినా ప్రయోగం సక్సెస్ కాలేదు. కానీ ఇస్రో శాస్త్రవేత్తలు పట్టు విడవకుండా ప్రయత్నించి విజయం సాధించి దేశం గర్వించేలా చేశారు. గతంలో జీఎస్–ఎల్‌వీ–ఎఫ్10 వైఫల్యం వల్ల జీశాట్–1 శాటిలైట్ కక్ష్యను చేరుకోలేకపోయింది. ఇస్రో మరింత మెరుగైన టెక్నాలజీతో ఈఓఎస్–05ను ప్రయోగించి విజయాన్ని అందుకుని సత్తా చాటింది. కాగా, ఈ ప్రయోగం చేస్తున్న సమయానికి కుండపోత వర్షం కురుస్తోంది. అయినప్పటికీ లాంచ్ వ్యూ గ్యాలరీకి 1,500 మంది వరకు వచ్చిన సందర్శకులు వానలో తడుస్తూనే ఈ అద్భుత ఘట్టాన్ని తిలకించి ఇస్రో శాస్త్రవేత్తలను ఉత్సాహపరిచారు. దేశాన్ని గర్వించేలా చేసిన ప్రయోగాన్ని వీక్షిస్తూ చప్పట్లతో ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# అశోక్ గజపతి స్థల వివాదంపై విచారణ

మొదటి పేజీ తరువాయి...

విజయనగరం కలెక్టర్‌కు ఆధారాలు సమర్పించారు. సదరు ఆధారాలను పరిశీలించిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి ఎమ్మార్వో ప్రభాకర్ రావుపై విచారణకు ఆదేశాలు జారీ చేసింది. వారం రోజులలోపు ఆ వివరాలు అన్నీ ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించింది.



## ఫిబ్రవరి వరకు

# ఎల్ నినో పంజా

మొదటి పేజీ తరువాయి...

ఆర్థిక వ్యవస్థలకు, మానవ సమాజాలకు మిగిల్చేది మాత్రం కోలుకోలేని దెబ్బ. పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే ఈ ఎల్ నినో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర కరువులు, వరదలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు కారణమవుతోంది. ఎల్ నినో తీవ్రత పెరిగే కొద్దీ ఈ ప్రభావాలు మరింత పెరుగుతాయని మేము అంచనా వేస్తున్నాం" అని ఆమె హెచ్చరించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సెప్టెంబర్ నెల అంచనాలో, ఎల్ నినో పరిస్థితులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగవచ్చని పేర్కొన్న కొద్ది రోజులకే డబ్ల్యూఎంవో ఈ అంచనాలను వెలువరించడం గమనార్హం. సాధారణంగా ఎల్ నినో ఏర్పడిన సంవత్సరాల్లో భారతదేశంలో రుతుపవనాలు బలహీనపడటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఆగస్టు నెల గణాంకాలను పరిశీలిస్తే, దేశవ్యాప్తంగా సాధారణం కంటే 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. అంతేకాకుండా 1901 నుంచి ఇప్పటివరకు నమోదు కానంత అత్యధిక ఉష్ణోగ్రతలు ఈ ఆగస్టులోనే నమోదయ్యాయి. ఇక సెప్టెంబర్ నెలలో కూడా సుదీర్ఘకాల సగటు వర్షపాతంలో 91 శాతం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. ఇది రైతాంగానికి, ముఖ్యంగా వర్షాధార పంటలకు తీవ్ర ఆందోళన కలిగించే అంశం. కేవలం వర్షాకాలం మాత్రమే కాదు చలికాలంపై కూడా ఎల్ నినో నీడలు అలుముకున్నాయి. ఇప్పటికే దేశంలో శీతాకాలపు రోజులు తగ్గిపోతున్నాయని దిల్లీకి చెందిన 'క్లైమేట్ ట్రెండ్స్' సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. ఉత్తర భారతదేశంలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలలో ప్రతి దశాబ్దానికి ఉష్ణోగ్రత 0.69 డిగ్రీల సెల్సియస్ చొప్పున పెరుగుతోందని అంచనా. మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా వరుసగా 0.58 డిగ్రీలు, 0.66 డిగ్రీల సెల్సియస్ మేర వేడి పెరుగుతోంది. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల మన ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపుతోంది. శీతాకాలంలో పండించే ముఖ్యమైన రబీ పంట అయిన గోధుమలపై ఇది ప్రభావం చూపి పంట దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం ముగిసే సమయంలో వచ్చే ఈ వేడిగాలులు రైతులకు కోలుకోలేని దెబ్బగా మారుతున్నాయి. ఎల్ నినో సుదీర్ఘకాలం కొనసాగే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నందున, ఇటు ప్రభుత్వం అటు రైతాంగం ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నీటి నిల్వల నిర్వహణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉష్ణోగ్రత తట్టుకునే విత్తనాల వినియోగంపై దృష్టి సారించాల్సి ఉంది.

# మళ్లీ కలెక్టర్ల సదస్సు

మొదటి పేజీ తరువాయి...

చంద్రబాబు చర్చించనున్నారు. పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడనున్నారు. జలధార కార్యక్రమం పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ల ఉత్తమ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రదర్శన, వివరణ ఇవ్వనున్నారు. రెండో రోజు ఈ–గవర్నెన్స్, ఆర్టీజీఎస్, పీజీఆర్ ఎస్ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. భూ పరిపాలన, కేంద్ర పథకాల నిధుల వినియోగంపై చర్చించనున్నారు. జిల్లా కలెక్టర్లతో ఓపెన్ ఫోరంలో క్షేత్రస్థాయి సమస్యలపై మాట్లాడనున్నారు. చివరి రోజు శాంతిభద్రతల సమీక్షతో పాటు ముగింపు ప్రసంగాన్ని సీఎం చంద్రబాబు చేయనున్నారు.

## సైబర్ ముఠాలపై

# సీబీఐ కొరడా

అరాచకాలకు పాల్పడుతున్నాయి. బాధితుల్ని భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి కోట్లాది రూపాయలు గుంజుతున్నాయి. ఈ ముఠాలపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ తాజా తనిఖీలు చేపట్టింది. కాగా, వివిధ రాష్ట్రాల నుంచి సీబీఐ స్వీకరించిన మూడు కీలక డిజిటల్ అరెస్ట్ కేసుల్లో బాధితులను నెలల తరబడి డిజిటల్‌గా బంధించి, మొత్తం రూ. 42.36 కోట్లు దండుకున్నారు. ఫైనాన్షియల్, సాంకేతిక సమాచారాన్ని, బ్యాంకు ఖాతాల డేటాను విశ్లేషించిన తర్వాత సీబీఐ 89 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. ఈ సోదాల్లో బ్యాంకు రికార్డులు, డిజిటల్ డివైజ్‌లు, కీలక ఆధారాలను స్వాధీనం చేసుకుంది. ఈ నగదు ఎక్కడెక్కడికి మళ్లిందో తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ డిజిటల్ అరెస్ట్ వ్యవహారాలకు సంబంధించి హ్యాండ్లింగ్, మనీ లాండరింగ్‌లో పాల్గొన్న ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది.

1. బిట్స్ పిలానీ కేసు: బాధితుడిని మూడు నెలల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి, రూ. 7.67 కోట్లు కాజేశారు.
2. గుజరాత్ కేసు: పోలీసుల పేరిట నమ్మించి, ఒక వ్యక్తిని మూడు నెలలు డిజిటల్‌గా బంధించి ఏకంగా రూ. 19.24 కోట్లు వసూలు చేశారు.
3. కర్ణాటక కేసు: బాధితుడిని నెల రోజుల పాటు భయాందోళనకు గురిచేసి రూ. 15.45 కోట్లు దోచుకున్నారు.

### చిక్కిన ముగ్గురు సూత్రధారులు

ఆకాష్ (హర్యానా): ఇతని ఖాతాలోకి రూ. 1.95 కోట్లు రాగా, అదే రోజు ఆ డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించాడు.

రాజా కర్మాకర్ (కోల్‌కతా): ఇతని కంపెనీ ఖాతాలోకి రూ. 1.5 కోట్ల మోసం సొమ్ము జమ అయింది.

జ్యోతి రాణి: ఈమె తన ఖాతాలోకి వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని నగదు రూపంలో విత్‌డ్రా చేసి, మిగిలిన మొత్తాన్ని ఇతర ఖాతాలకు పంపిణీ చేసింది.



# తొలి బ్యాచ్‌లోనే ముగ్గురికి మెడికల్ సీట్లు

**రాజమహేంద్రవరం: జయజయహే :సెప్టెంబర్ 4:**

అన్‌అకాడమీ సెంటర్--రాజమండ్రి, అక్షర జూనియర్ కాలేజీ తొలి బ్యాచ్‌లోనే ముగ్గురు విద్యార్థులు నీట్‌లో మెడికల్ సీట్లు సాధించారు. మెడికల్ సీటు పొందిన మహమ్మద్ హారిష్‌ను మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కేవీ కృష్ణవర్మ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, అధ్యాపకుల అంకితభావమే విజయానికి కారణమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయుడు తేజేష్, బ్రాంచ్ హెడ్ ముద్దల మహేష్, జోనల్ ఇన్‌చార్జ్ అడబాల రాజేష్, బోటనీ లెక్చరర్ శ్రీనివాస్, కెమిస్ట్రీ లెక్చరర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

**మాడుగుల,సెప్టెంబర్4,జయ జయ హే**

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ఈ యాడాది వాసవి క్లబ్ క్రీడలను ప్రోత్సహిస్తుందని వాసవి క్లబ్ ప్రతినిధి శ్రీనాథ్ అప్పారావు చెప్పారు. వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసి గుప్త జయంతి వారోత్సవాలు సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో వారం రోజులు పాటు గ్రామీణ క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దాన్లో భాగంగా చీడికాడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో టి సురవరం గ్రామంలో శుక్రవారం వాలీబాల్, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బత్తుల శ్రీను, బి పద్మ గెలుపొందగా వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్టి లు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు



# గదప్పాలెం పంచాయతీలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం..

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 05,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం గదప్పాలెం పంచాయతీ మల్లవరం గ్రామంలోని తలుపులమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.డీవీడీ ప్రసాద్, జనజాతి సురక్షా మంచ్ అధ్యక్షులు (ఏపీ) మరియు గౌరీ పార్వతి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి (అల్లూరి జిల్లా) సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రామ సన్నిధానం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 100 మంది భక్తులకు ఒక్కొక్కరికి 4 చీరల చొప్పున పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి. మచ్చమ్మ (ఆంధ్ర కళ్యాణాశ్రమం), కేజీయా రాణి (మహిళా మోర్చా అధ్యక్షురాలు), సంపరి శివ (బీజేపీ అధ్యక్షులు, కొయ్యూరు), ఎం. మంగ (మార్కెట్ యార్డ్ చైర్మన్, పాడేరు), వి. మల్లేసు, చిన్ని రాజు, గిరిజన అర్చకులు హాజరయ్యారు. వచ్చిన భక్తులు, అతిథులకు తలుపులమ్మ తల్లి ఆలయ కమిటీ, గ్రామస్థులు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ఘనంగా నిర్వహించినందుకు నిర్వహణ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.



# అయ్యన్నపాత్రుడు జన్మ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బుద్ధ నాగ జగదీష్

**అనకాపల్లి జయ జయహే**

నర్సీపట్నంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలు ఘనంగా అభిమానులు నాయకులు కార్యకర్తలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి అనకాపల్లి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ పాల్గొని అయ్యన్నపాత్రుడు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ దుస్సాలవతో సత్కరించడం జరిగింది ఈయనతో పాటు అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి స్టేట్ రోడ్ భవనాల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు స్టేట్ కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ జి కుమార్  తదితరులు పాల్గొన్నారు

# బిల్లు అయిపోయాక చర్యలా?

## పర్యవేక్షణ ఏదని గిరిజనుల ప్రశ్న

**కొయ్యురు : (జయ జయహే ) న్యూస్ సెప్టెంబర్ 05,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీలోని గిరిజన గ్రామాల్లో చేపడుతున్న తారు రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించిందని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న రోడ్లు పూర్తికాకముందే దెబ్బతింటున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం మెటీరియల్ వినియోగం, తారు మిశ్రమం, రోడ్డు మందం, కాంపాక్షన్ వంటి అంశాల్లో నాణ్యత పాటించడం లేదని ఆరోపిస్తున్నారు.క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారిందని, వారి నిర్లక్ష్యం వల్లే నాసిరకం పనులు జరుగుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు.ప్రభుత్వ నిధులతో నాణ్యత లేని రోడ్లు వేస్తే ప్రజాధనం వృథా కావడంతో పాటు, గిరిజనులు మళ్లీ రవాణా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లు విడుదల చేసే ముందే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి నాణ్యతను తేల్చాలని, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.



# సింగవరంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ సెప్టెంబర్ 05,**

అల్లూరి  జిల్లా కొయ్యూరు మండలం సింగవరం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామంలోని శ్రీకృష్ణ మందిరంలో గోమాత సమేతంగా ఉన్న బాలకృష్ణుడి విగ్రహానికి రంగురంగుల పూలతో ప్రత్యేక అలంకరణ చేసి, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హోమం, భజన, కోలాటం కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. శ్రీకృష్ణ లీలలను భక్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మువ్వల రాజు, గజ్జ అప్పలరాజు, గదుల దుర్గరాజు, సప్ప చిన్న రాము, మోల్లి రాజబాబు, గజ్జి లావ, సప్ప నాగేంద్ర, మామిడి సోమరాజు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# గోదావరి జలాలు అనకాపల్లికి చేరడంతో మొక్కులు  చెల్లించుకున్న సీఎం రమేష్

**అనకాపల్లి జయ జయహే**

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ దర్శించుకోవడం జరిగింది అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు వచ్చిన సందర్భంగా తిరుమలకు వచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నట్టుగా తెలిపారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషితో అనకాపల్లి జిల్లాకు గోదావరి జలాలు తీసుకురావడం ఎంతో సంతోషకరమైన ఆనందకరమైన విషయమని  ఇటు రైతులకు అటు ప్రజలకు ఎంతో ఉపయోగపడే జలాలు అనకాపల్లి జిల్లాకు రావడం జిల్లా వాసులు సంతోషిస్తున్నారని వారు పేర్కొన్నారు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతోనే గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరాలని అందుకే తిరుపతి వెంకటేశ్వర స్వామికి మొక్కులు  చెల్లించుకున్నాని ఆయన తెలిపారు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేలా ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఈ ప్రభుత్వానికి ఉండాలని ఆయన కోరుకున్నట్లు ఎంపీ సీఎం రమేష్ తెలియజేశారు



# నిడదవోలులో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణంలోని గణపతి సెంటర్ ప్రాంతం బూత్ నంబర్ 35లో "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం, ఇంటింటా తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు, నిడదవోలు టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, వల్లూరి సూరిబాబు, ఆకుతోట సతీష్‌కుమార్, ఎస్‌కే కరీం, మధురబోయిన గణపతి, కారంకి నవీన్‌కుమార్, కే. రమేష్, పి. అనుష తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



# కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

శ్రావణ శుక్రవారం సందర్భంగా నిడదవోలు నియోజకవర్గం, నిడదవోలు రూరల్ మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, ఉచిత శ్రావణ వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆలయాన్ని సందర్శించి శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 1,500 మంది ముత్తైదువులు ఉచిత వరలక్ష్మీ వ్రత పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ఎస్.వి.కె.ఎ. శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న మహిళలకు దేవస్థానం తరపున కుంకుమ, పసుపు, గాజులు, ప్రసాదాలను అందజేశారు.దాతల సహకారంతో ముత్తైదువులకు రవికల గుడ్డ పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు శ్రీ దేవులపల్లి రవిశంకర్ పాల్గొన్నారు.శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ వ్రతాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



# కబ్జాకి గురైన ప్రభుత్వ పాఠశాల స్థలంకు చర్యలు లేవా

**డుంబ్రిగూడ: జయ జయహే.**

డుంబ్రిగూడ మండల కేంద్రంలోని అరకు పంచాయతీ (నేరేడువలస) మండల ప్రజా పరిషత్ పాఠశాలలో, పాఠశాలకు చెందిన 54/3 సర్వే నంబర్లు విస్తీర్ణం గల 1.15 సెంట్లు పాఠశాల స్థలంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కబ్జా చేయడం జరిగింది. ఈ విషయ పై పాఠశాల ప్రధానోపాధ్యాయులను హారతియగా మా పాఠశాల స్థలము కబ్జాకు గురైందని చెప్పడం జరిగింది. ఈ విషయంపై పలుమార్లు మండల తాసిల్దార్ వారిని,అరకు పంచాయతీ సెక్రెటరీ, విఆర్ఓ సంప్రదించిన ఎలాంటి స్పందన లేకపోవడంతో గిరిజన సంఘాలు,స్థానికులు మండల తాసిల్దార్ సిబ్బందిపై మండిపడుతున్నారు. ఇదే విషయంపై స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్, సెక్రటరీ, వీఆర్వో, వచ్చి కబ్జాకు గురైన పాఠశాల స్థలంలో సర్వే నిర్వహిస్తుండగా స్థానిక మాజీ సర్పంచ్ గుగుడు శారద, తమ విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది పై దురుసుగా ప్రవర్తించి. గ్రామ పెద్ద మాజీ ఎంపీపీ చట్టారి సాయిబాబా పై గ్రామస్తుల పై విలేకరుల పై చిందులేస్తూ దిక్కున్న చోటా చేసుకొండని ఆమె అన్నారు. కావున జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో కబ్జాకు గురైన స్థలంపై విచారణ చేపట్టి పాఠశాలకు స్థలంను కేటాయించవలసిందిగా ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



## సుంకాల యుద్ధంలో గెలుపెవరిది?

(ప్రతాప్)

ప్రపంచ వాణిజ్యం ఒకప్పుడు "తక్కువ సుంకాలు--ఎక్కువ వాణిజ్యం" అనే సూత్రంపై పరుగులు తీసింది. ఇప్పుడు అదే ప్రపంచం "ఎక్కువ సుంకాలు--విభిన్న సరఫరా గొలుసులు" అనే కొత్త వాస్తవాన్ని ఎదుర్కొంటోంది. అమెరికా--చైనా పోటీ, అమెరికా--యూరోపియన్ యూనియన్ సుంక ఒప్పందాలు, సాంకేతిక నియంత్రణలు, కీలక ఖనిజాలపై పరిమితులు---ఇవన్నీ కలిసి ప్రపంచీకరణ స్వరూపాన్నే మార్చుతున్నాయి.

2025లో అమెరికా చైనా దిగుమతులపై సగటు సుంకాన్ని దాదాపు 50 శాతానికి పెంచింది. ఫలితంగా 2025లో అమెరికా చైనా నుంచి చేసిన వాస్తవ దిగుమతులు 28 శాతం తగ్గాయి. అదే సమయంలో చైనా మినహా ఇతర దేశాల నుంచి అమెరికా దిగుమతులు 9 శాతానికి పైగా పెరిగాయి. 2017తో పోలిస్తే అమెరికా దిగుమతుల్లో చైనా వాటా 12 శాతం పాయింట్లకు పైగా తగ్గగా, తైవాన్, వియత్నాం, మెక్సికో వాటాలు పెరిగాయి. అంటే సుంకాలు వాణిజ్యాన్ని పూర్తిగా ఆపలేకపోయినా, వాణిజ్య మార్గాలను మాత్రం మళ్లిస్తున్నాయి.

యూరోపియన్ యూనియన్‌కూ పరిస్థితి భిన్నంగా లేదు. అమెరికా--యూరోపియన్ యూనియన్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం చాలా యూరోపియన్ యూనియన్ ఉత్పత్తులపై అమెరికా సుంకం 15 శాతం వద్ద ఉండేలా వ్యవస్థ ఏర్పడింది. ఉక్కు, అల్యూమినియం వంటి రంగాల్లో మాత్రం ప్రత్యేక సుంకాలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో యూరోపియన్ యూనియన్ అమెరికా నుంచి 2028 నాటికి సుమారు వి750 బిలియన్ల ఇంధన ఉత్పత్తులు, కనీసం వి40 బిలియన్ల కృఇతిమ మేధస్సు చిప్స్ కొనుగోలు చేయాలనే ఉద్దేశాన్ని ప్రకటించింది.

ఈ పరిణామాల అసలు ధర వినియోగదారుడే చెల్లించాల్సి రావచ్చు. సుంకం దిగుమతిదారుని ఖర్చును పెంచుతుంది; అది ఉత్పత్తి ధరగా మారితే ద్రవ్యోల్బణ ఒత్తిడి పెరుగుతుంది. ఐ ఎం ఎఫ్ ప్రకారం 2026లో ప్రపంచ వృద్ధి 3.1 శాతంగా ఉండవచ్చని, ప్రపంచ ద్రవ్యోల్బణం మళ్లీ కొంత పెరిగే అవకాశం ఉందని అంచనా. వాణిజ్య విభజన దీర్ఘకాలంలో ప్రపంచ ఘ్డ్పు 0.3 నుంచి 7 శాతం వరకు తగ్గించే ప్రమాదం ఉందని ఐ ఎం ఎఫ్ అధ్యయనాలు సూచిస్తున్నాయి.

అయితే ఈ సంక్షోభంలో భారత్‌కు ఒక చారిత్రక అవకాశం ఉంది. 2024--25లో భారత వస్తు ఎగుమతులు వి437.70 బిలియన్లు, వస్తు--సేవల మొత్తం ఎగుమతులు రికార్డు స్థాయిలో వి825.25 బిలియన్లు చేరాయి. 2025--26 ఏప్రిల్--జనవరి కాలంలోనే మొత్తం ఎగుమతులు వి720.76 బిలియన్లు, సేవల ఎగుమతులు వి354.13 బిలియన్లు నమోదయ్యాయి.

ఇది కేవలం అదృష్టం కాదు---అవకాశాన్ని విధానంగా మార్చుకోవాల్సిన సమయం. ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, రక్షణ ఉత్పత్తులు వంటి రంగాల్లో ఉత్పత్తి సామర్థ్యం పెంచాలి. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుత్, నైపుణ్యాలు, నాణ్యతా ప్రమాణాలపై పెట్టుబడులు పెంచాలి. ఒక దేశంపై ఆధారపడే సరఫరా గొలుసులకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను "చైనా౦1" మాత్రమే కాకుండా "చైనా ౦ఇండియా" కేంద్రంగా నిలబెట్టాలి.

అంతిమంగా సుంకాల యుద్ధంలో నిజమైన విజేత ఎవరూ ఉండకపోవచ్చు. అమెరికా కొంత ఉత్పత్తిని తిరిగి తెచ్చుకోవచ్చు; చైనా కొత్త మార్కెట్లను వెతుక్కోవచ్చు; యూరప్ తన సరఫరా గొలుసులను పునర్వ్యవస్థీకరించవచ్చు. కానీ అధిక ధరలు, అనిశ్చితి, తక్కువ పెట్టుబడులు ప్రపంచ ప్రజలపై భారమవుతాయి. అందుకే భారత్ సుంకాల యుద్ధంలో ఒక పక్షంగా కాకుండా, మారుతున్న ప్రపంచ వాణిజ్యానికి విశ్వసనీయ ప్రత్యామ్నాయ కేంద్రంగా ఎదగాలి. అదే సంక్షోభాన్ని అవకాశంగా మార్చే నిజమైన వ్యూహం.

# ఆచార్యదేవోభవ

## మనకు సంస్కారాన్ని అందించేది గురువు మాత్రమే..!!

### గురుపూజోత్సవం సందర్భంగా ప్రత్యేక శీర్షిక..... గురు బ్రహ్మ గురు విష్ణు... నేటి విద్యార్థికి గురువు ఆవశ్యకత

**గురు అనే పదంలో బృహత్తరమైన అంతరార్థం దాగి ఉంది. "గు"అనగా చీకటి అజ్ఞానం. "రు"అనగా తొలగించేవారు. అజ్ఞానం అనే చీకటిని తొలగించి జ్ఞానమని వెలుగును ప్రసాదించేవాడే గురువు. ఈ అక్షరాలు లో ఒక ప్రపంచం దాగి ఉంది. ఈ అక్షరాలకు సాటి మేటి అయిన అక్షరాలు ఈ జగత్తులో ఏమీ లేవు.**




" తల్లిదండ్రులు మనకు ఈ ప్రపంచాన్ని పరిచయం చేస్తే గురువులు ఈ ప్రపంచానికి మనల్ని పరిచయం చేస్తారు ".

,గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవై నమః

సాక్షాత్తు గురువు బ్రహ్మతో సమానం. సృష్టికర్త బ్రహ్మ ఎటువంటి విధంగా జగత్తుని సృష్టిస్తాడో మనల్ని కూడా ధర్మమార్గం లో నడిపించేది గురువే. గురువు అనగా విష్ణువు మహేశ్వరుడు తో సమానం. విష్ణువులా పోషకుడు, రక్షకుడు. శివుడిలా సంరక్షకుడు గురువు. మనలో ఉన్న సోమరితనం, అజ్ఞానం, అహంకారం తొలగించేవాడు గురువు. గురువు బ్రహ్మ విష్ణువు మహేశ్వరుడు ఈ మూడు స్వరూపాలే కాకుండా అతీతమైన స్వరూపమే గురువు. అనగా దేవుని రూపంలో గురువు మన ముందుకు వచ్చారు. గురువు అనే మాటకు మించిన పదం ఈ ప్రపంచంలో లేదు అమ్మ ప్రేమను, లాలనను ఇస్తే నాన్న ధైర్యాన్ని ఇస్తే గురువు బ్రతుకుతెరువును, బ్రతకడం ఎలాగో ఇచ్చే నిస్వార్ధ జీవి. ఈ రోజుల్లో అన్ని ధనంతో లభ్యమవుతున్నాయి. అందుబాటులో అన్నీ ఉన్నాయి. కానీ గురువు ఇచ్చే జ్ఞానము సంస్కారం ధనంతో కొనలేము. లభ్యం కావు.

గురువును పూజిస్తే -జ్ఞానం వస్తుంది
జ్ఞానం వస్తే వినయం - వస్తుంది
వినయం వస్తే - విజయం వస్తుంది.

గురుపూజోత్సవం రోజు నాడు వేదాలను నాలుగుగా విభజన చేసిన వ్యాస మహర్షిని స్మరించుకోవాలి. గురువులందరికి మూల గురువు వ్యాస మహర్షి. మన హిందూ ధర్మంలో తొలి పూజ గురువుకు చేస్తాము. ఏ పూజ చేసినా, ఏ యజ్ఞం చేసినా, ఏ యాగం చేసినా మొదటిగా శ్రీ గురుభ్యోనమః అని అంటాము. గురువును తలుచుకొని పనిని ఆరంభిస్తే విఘ్నాలు లేకుండా ఉంటాయి.

**విద్యార్థి జీవితం లో గురువు - జ్ఞానజ్యోతి**

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో కూడా గురువు భోదన మారలేదు . వ- పుస్తకములు, ఇంటర్నెట్లు ఎన్ని ఉన్నా గురువు యొక్క అనుభవంతో చెప్పే పాఠ్యాంశ బోధన అతి విలువైనది. అమూల్యమైనది. గురువు ఇచ్చే జ్ఞానం మనకు జీవితాంతం ఉపయుక్తం అవుతుంది. గురువు కేవలం చదువు ఒకటే బోధించడు.సంస్కారంతో కూడిన చదువును నేర్పిస్తాడు. చదువు ఎంత ఉన్న సంస్కారం ఉంటేనే దాని యొక్క విలువ. ఆన్లైన్లో ఈ పాఠాలు, వ-పుస్తకాలు విరివిగా లభ్యం అవుతున్నప్పటికీ, యూ ట్యూబ్ లో పాఠాలు ఎన్ని లభ్యమవుతున్న మన జీవితంలో అవరోధాలు లేని విధంగా ఎలా నడుచుకోవాలి, అవరోధాలను ఎలా ఎదుర్కోవాలి, అనే విషయాలను చెప్పేది మాత్రం గురువే. ఇటువంటి నడక నేర్పిన గురువులను జీవితకాలం పాటు గుర్తు చేసుకుంటూ, వారికి గురుపూజోత్సవాలు ఎన్నో జరిపిస్తూ, గురువు నేర్పిన పాఠాలను ఆచరణలో పెట్టడం మన యొక్క నైతికత.

**ఉపాధ్యాయుడు - రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్- మార్గదర్శకత**

రాధాకృష్ణన్ గారు ఎప్పుడూ ఒకే మాట అనేవారు తన ప్రసంగాలలో నేను ఉపాధ్యాయుడిని అయిన తర్వాత రాష్ట్రపతి ని అని అనేవారు. వీరి యొక్క జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపమని ప్రసంగాలలో కోరేవారు. ఆయన జీవితంలో ఆయనకు ఎన్నో విషయాలను జీవిత పాఠాలను నేర్పిన తత్వశాస్త్ర ప్రొఫెసర్. డా. ఆల్ ఫెడ్ జార్జ్ హాగ్ ఎంతో మార్గదర్శకత్వం అని ప్రతీ ప్రసంగాల లో ప్రతి వేదికలో ఆయన గురువు గురించి ప్రస్తావించేవారు. దేశ నిర్మాణం తరగతి గది నాలుగు గోడల మధ్య జరుగుతుంది అనేది వాస్తవం. గురువు చేతుల్లోనే సమాజాభివృద్ధి ఉంటుంది. గురువులందరికీ గురు పూజోత్సవ శుభాకాంక్షలు తో....

రచన
ఏ. బాల సౌజన్య కుమారి,
తెలుగు ఆచార్యులు, విద్యావేత్త,
ఆధ్యాత్మికవేత్త,ప్రవచనకర్త.

## నిధుల ప్రవాహంతో వృద్ధి వేగానికి ఊతం

(ప్రతాప్)

బ్యాంకుల్లో డబ్బు కొరత ఉంటే ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుంది. డబ్బు మరీ ఎక్కువైతే ద్రవ్య విధానానికి కొత్త చిక్కులు వస్తాయి. ప్రస్తుతం భారత బ్యాంకింగ్ వ్యవస్థ ఎదుర్కొంటున్న పరిస్థితి ఈ రెండింటి మధ్య సమతుల్యతను కోరుతోంది.

దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు ద్రవ్య లభ్యత నాలుగున్నరేళ్లకు పైగా కాలంలో ఎన్నడూ లేనంత స్థాయికి చేరింది. సెప్టెంబరు 3 నాటికి ఈ మిగులు ₹7.76 లక్షల కోట్లకు చేరినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆగస్టు 30న ఇది ₹5.05 లక్షల కోట్లు కాగా, ఆగస్టు 31న ₹6.65 లక్షల కోట్లకు చేరింది. అంటే కొద్ది రోజుల్లోనే బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా నిధులు చేరాయి.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం విదేశీ కరెన్సీ నిధుల భారీ సమీకరణ. భారతీయ బ్యాంకులు ప్రత్యేక స్వాప్ సదుపాయం ద్వారా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల రూపంలో వి127.22 బిలియన్లు సమీకరించాయి. దీనికి అదనంగా ఈసీబీలు, విదేశీ కరెన్సీ రుణాలు కలిపి మొత్తం సమీకరణ వి136.37 బిలియన్లకు చేరింది. జూన్ 8న ప్రారంభమైన ప్రత్యేక సదుపాయానికి ఊహించిన దానికంటే అనూహ్యమైన స్పందన రావడంతో ఈ భారీ నిధులు దేశంలోకి వచ్చాయి.

విదేశీ కరెన్సీ దేశంలోకి వచ్చినప్పుడు దాన్ని రూపాయిలుగా మార్చడం వల్ల దేశీ-య బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెరుగుతుంది. ఇది ఒక రకంగా అవకాశమే. బ్యాంకుల వద్ద నిధులు సమృద్ధిగా ఉంటే పరిశ్రమలు, చిన్న వ్యాపారాలు, గృహ రుణాలు, మౌలిక వసతుల రంగాలకు రుణాలు సులభంగా అందే అవకాశం ఉంటుంది. రుణ వ్యయం తగ్గితే పెట్టుబడులు, వినియోగం పెరిగి ఆర్థిక వృద్ధికి ఊతం లభించవచ్చు. పండుగల సీజన్ ముందున్న సమయంలో అదనపు ద్రవ్య లభ్యత రుణ డిమాండ్‌కు కూడా తోడ్పడే అవకాశముంది.



కానీ ద్రవ్య సమృద్ధి ఎల్లప్పుడూ శుభపరిణామమే కాదు. బ్యాంకుల వద్ద అవసరానికి మించిన నిధులు ఉంటే స్వల్పకాలిక వడ్డీ రేట్లు వేగంగా తగ్గుతాయి. తాజా పరిస్థితుల్లో వెయిటెడ్ యావరేజ్ కాల్ రేటు 4.81 శాతానికి పడిపోయింది. ఇది రెపో రేటు కంటే 44 బేసిస్ పాయింట్లు తక్కువ. ద్రవ్య లభ్యత అధికంగా ఉండటం వల్ల స్వల్పకాలిక మార్కెట్ వడ్డీ రేట్లు కేంద్ర బ్యాంకు నిర్దేశించే విధాన సంకేతాలకు దూరమయ్యే అవకాశం ఉంటుంది.

ఇక్కడే భారతీయ రిజర్వు బ్యాంకుకు అసలు సవాలు ఎదురవుతోంది. ఒకవైపు ఆర్థిక వ్యవస్థకు అవసరమైనంత ద్రవ్యాన్ని అందుబాటులో ఉంచాలి. మరోవైపు అదనపు నిధులు ద్రవ్యోల్బణానికి, ఆస్తుల ధరల్లో అసమతుల్యతకు కారణం కాకుండా చూడాలి. అందుకే ఆర్‌బీఐ ప్రస్తుతం తాత్కాలికంగా అదనపు ద్రవ్యాన్ని ఉపసంహరించే చర్యలను చేపడుతోంది. అయితే ఈ భారీ ప్రవాహాన్ని దీర్ఘకాలికంగా ఎలా నిర్వహించాలన్నదే కీలకం.

మరో ముఖ్యమైన అంశం విదేశీ మారక నిల్వలు. భారీ విదేశీ కరెన్సీ ప్రవాహం రూపాయి స్థిరత్వానికి, దేశ బాహ్య ఆర్థిక భద్రతకు కొంత బలం ఇస్తుంది. తాజా ప్రవాహాల్లో ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లే ప్రధాన భాగం కాగా, ఈసీబీలు మరియు విదేశీ కరెన్సీ రుణాలు కూడా గణనీయంగా ఉన్నాయి. అయితే ఇవన్నీ ఉచిత నిధులు కావు; భవిష్యత్తులో వాటికి సంబంధించిన చెల్లింపులు, మారకపు రిస్కులు ఉంటాయి. అందువల్ల తక్షణ ప్రయోజనాలతో పాటు దీర్ఘకాలిక బాధ్యతలను కూడా లెక్కలోకి తీసుకోవాలి.

కాబట్టి ప్రస్తుత ద్రవ్య సమృద్ధిని సంక్షోభంగా కాకుండా బాధ్యతతో వినియోగించాల్సిన అవకాశంగా చూడాలి. అదనపు నిధులు ఉత్పాదక రంగాలకు రుణాలుగా మారాలి. పెట్టుబడులు, ఉపాధి, మౌలిక వసతులు, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా ప్రవహించాలి. అదే సమయంలో ఆర్‌బీఐ ద్రవ్య లభ్యతను సున్నితంగా సర్దుబాటు చేస్తూ ధరల స్థిరత్వాన్ని, ద్రవ్య విధాన ప్రభావాన్ని కాపాడాలి.

బ్యాంకుల్లో డబ్బు పేరుకుపోవడం వృద్ధి కాదు. ఆ డబ్బు కర్మాగారాల్లో పెట్టుబడిగా, వ్యాపారాల్లో విస్తరణగా, యువతకు ఉపాధిగా మారినప్పుడే అది ఆర్థిక శక్తి. ద్రవ్య సమృద్ధి వృద్ధికి ఇంధనంగా మారాలి---ఆర్థిక వ్యవస్థకు భారంగా కాదు.

## జలాలపై సమతుల్యతే శ్రేయస్కరం

(ప్రతాప్)

నదికి సరిహద్దులు ఉండవు. కానీ నదీ జలాలకు హక్కుల ప్రశ్నలు ఉంటాయి. ఆ హక్కులను ఘర్షణగా కాకుండా సహకారంగా పరిష్కరించుకోవడమే ఆధునిక జల పరిపాలనకు అసలు పరీక్ష.

నదులు ప్రకృతి ప్రసాదించిన ఉమ్మడి వనరులు. ఒక ప్రాంతంలో కురిసిన వర్షం, ఒక రాష్ట్రంలో పుట్టిన నది చివరకు మరొక రాష్ట్రానికి లేదా పొరుగు దేశానికి చేరుతుంది. అందువల్ల నదీ జలాల వినియోగం కేవలం నీటి పంపిణీ అంశం కాదు. వ్యవసాయం, తాగునీరు, ప్రజల జీవనోపాధి, పర్యావరణ సమతుల్యత, ప్రాంతీయ అభివృద్ధి, అంతర్జాతీయ సంబంధాలతో ముడిపడిన కీలక అంశం. ఈ నేపథ్యంలో గంగా జలాల పంపిణీకి సంబంధించి భారత్--బంగ్లాదేశ్ మధ్య కుదిరిన ఒప్పందం పునరుద్ధరణ ప్రాధాన్యం సంతరించుకుంది.



1996లో కుదిరిన గంగా జలాల ఒప్పందం 30 ఏళ్ల కాలానికి అమల్లోకి వచ్చింది. ఫరక్కా వద్ద గంగా జలాల పంపిణీకి సంబంధించిన ఈ ఒప్పందం 2026 డిసెంబరులో ముగియనుంది. దాని పునరుద్ధరణకు సంబంధించిన చర్చలు ముందుకు సాగుతున్న సమయంలో బంగ్లాదేశ్ అవసరాలతో పాటు గంగా పరివాహక ప్రాంతంలోని భారత రాష్ట్రాల ప్రయోజనాలను కూడా సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా బిహార్ వంటి రాష్ట్రాలకు సాగునీరు, తాగునీరు, నదీ పర్యావరణం వంటి అంశాలు ఎంతో ప్రాధాన్యమైనవి.

అయితే ఈ అంశాన్ని భారత్--బంగ్లాదేశ్ మధ్య ప్రయోజనాల ఘర్షణగా చూడటం సరైన దృక్పథం కాదు. నదీ జలాలు పరిమిత వనరులే అయినప్పటికీ, వాటి వినియోగంలో శాస్త్రీయ ప్రణాళిక, పరస్పర అవగాహన, నిరంతర సమాచార మార్పిడి ఉంటే ఇరుపక్షాల అవసరాలను సమతుల్యం చేయడం సాధ్యమే. బంగ్లాదేశ్‌కు గంగా జలాలు వ్యవసాయం, జీవనోపాధి, పర్యావరణానికి కీలకం. అదే సమయంలో భారత రాష్ట్రాలకు తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణ కోసం నీరు అవసరం. ఈ అవసరాల మధ్య సమతుల్యతే స్థిరమైన పరిష్కారానికి పునాది.

మారుతున్న వాతావరణ పరిస్థితులు ఈ సవాలును మరింత క్లిష్టం చేస్తున్నాయి. అస్థిర వర్షపాతం, వరదలు--కరువుల తీవ్రత, పెరుగుతున్న జనాభా, పట్టణీకరణతో నీటి అవసరాలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. అందువల్ల గతంలోని నదీ ప్రవాహాల గణాంకాలనే ఆధారంగా చేసుకుని భవిష్యత్తు జల అవసరాలను నిర్ణయించడం సరిపోదు. వర్షపాతం, నదీ ప్రవాహం, భూగర్భజలాలు, సాగు అవసరాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ఆధారపడిన శాస్త్రీయ విధానం అవసరం.

ఈ ప్రక్రియలో సమాఖ్య స్ఫూర్తికి కూడా ప్రత్యేక స్థానం ఉంది. అంతర్జాతీయ నదీ జల ఒప్పందాలపై కేంద్రం చర్చలు జరిపేటప్పుడు సంబంధిత రాష్ట్రాల అవసరాలు, అభిప్రాయాలను ముందుగానే పరిగణనలోకి తీసుకోవడం సముచితం. అదే సమయంలో రాష్ట్రాలు కూడా పరస్పర సహకారంతో, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగాలి. కేంద్రం--రాష్ట్రాలు, రాష్ట్రాలు--రాష్ట్రాలు, భారత్--పొరుగు దేశాల మధ్య సమన్వయం బలపడితేనే జల భద్రతకు దీర్ఘకాలిక పునాది ఏర్పడుతుంది.

నీరు రేపటి ప్రపంచంలో అత్యంత విలువైన వనరుల్లో ఒకటిగా మారనుంది. అందువల్ల నదీ జలాలపై నిర్ణయాలు తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలకంటే దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఉండాలి. పొరుగు దేశాల అవసరాలను గౌరవిస్తూనే భారత రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడటం, రాష్ట్రాల హక్కులను గౌరవిస్తూనే జాతీయ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడం---ఇదే సమతుల్య జల విధానానికి లక్షణం.

నీరు ఎవరిదనే ప్రశ్నకు సరిహద్దులు సమాధానం చెప్పలేవు. నీటిని ఎలా పంచుకుంటామన్నదే మన నాగరికతకు కొలమానం. నదులను వివాదాల వాహకాలుగా కాకుండా సహకారానికి వారధులుగా మార్చగలిగితేనే జలహితం, ప్రజాహితం రెండూ సాకారం అవుతాయి.

# బడి బాటలో బాసటగా...
# గురువుల సేవాభావం!





### విద్యార్థుల కోసం సొంత డబ్బులతో ఆటో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు

### ఉపాధ్యాయుడు కామేశ్వరరావు చొరవతో పాఠశాల భవన నిర్మాణం

### నేడు గురుపూజోత్సవం సందర్భంగా జయ జయహే ప్రత్యేక కథనం

**ముంచంగిపుట్టు, జయ జయహే**

మండలంలోని ఏనుగురాయి పంచాయతీ బొండాపుట్టు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తమ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. దూర ప్రాంతాల నుంచి కాలినడకన బడికి వస్తున్న చిన్నారుల కష్టాలను గుర్తించి, తమ సొంత డబ్బులతో ఆటోను ఏర్పాటు చేసి విద్యార్థులకు అండగా నిలిచారు.

ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 34 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బొండాపుట్టు, తడ్డాపల్లి, లుంగాపుట్టు తదితర గ్రామాలకు చెందిన సుమారు 18 మంది చిన్నారులు ప్రతిరోజూ 3 నుంచి 6 కిలోమీటర్ల వరకు కాలినడకన పాఠశాలకు చేరుకుంటున్నారు.

**పాక నుంచి పక్కా భవనం వరకు...**

పాఠశాలకు భవనం లేక గత ఏడాది వరకు విద్యార్థులకు పాకలోనే విద్యాబోధన సాగింది. దీంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉపాధ్యాయుడు కామేశ్వరరావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు మండల పరిషత్ నుంచి రూ.2 లక్షల నిధులు కేటాయించారు. అయితే భవన నిర్మాణానికి ఆ నిధులు సరిపోకపోవడంతో కామేశ్వరరావు తన సొంతంగా రూ.50 వేలను వెచ్చించి నిర్మాణానికి సహకరించారు.

ప్రస్తుతం భవనంలో ఇద్దరు ఉపాధ్యాయులు, బాసా వాలంటీర్ల సహకారంతో ఐదు తరగతుల విద్యార్థులకు విద్యాబోధన కొనసాగుతోంది.

**గురువులే బడి బాటకు బాసట...**

విద్యార్థుల రాకపోకల కష్టాలను గుర్తించిన ఉపాధ్యాయులు కామేశ్వరరావు, గోవిందు మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. చిన్నారులు సురక్షితంగా ప్రతిరోజూ పాఠశాలకు చేరుకునేలా నెలకు రూ.3,000 సొంత డబ్బులు చెల్లిస్తూ ఆటోను ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుల చొరవతో విద్యార్థుల బడి ప్రయాణం సులభతరమైంది. దీంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, గురుపూజోత్సవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం సొంత నిధులు వెచ్చిస్తున్న ఉపాధ్యాయులు కామేశ్వరరావు, గోవిందులను గ్రామస్తులు అభినందించారు.

## మైచర్లపాలెంలో సామూహిక వరలక్ష్మి పూజలు

**చోడవరం, సెప్టెంబరు 4, జయ జయహే**



మండలంలోని మైచర్లపాలెంలో వేంచేసి యున్న శ్రీ సీతారాముల వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలచే సామూహికంగా వరలక్ష్మీ పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం, శ్రీ కృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని వేకువజాము నుండి మహాగణపతి మహాలక్ష్మి సమేత సీతారామ చంద్రుల వారికి శ్రీ సూక్త, పురుష సూక్త విధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తులు చే సామూహికంగా వరలక్ష్మీదేవికి పాలు పంచామృతాభిషేకములు సహస్రనామ హారిద్ర, కుంకుమ అభిషేకములు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు పారుపూడి వెంకట సత్యనారాయణ మూర్తి తెలియజేశారు. మైచర్లపాలెం చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు భక్తులు విచ్చేసి అమ్మవారి సహస్రనామ కుంకుమ పూజలు ఉత్సాహంగా పాల్గొన్నట్లు ఆలయ కమిటీ తెలియజేశారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**మాడుగుల సెప్టెంబర్ 4 జయజయహే**

మాడుగుల జగ్గన్న చావడి వద్ద నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయంలో కృష్ణ అష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పి అప్పలరాజు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.





## సామాజిక స్పృహ కలిగిన పవన్

### సమాజ సేవకులను గుర్తించడం అభినందనీయం

### మాజీ విసి ముత్యాల నాయుడు

**మాడుగుల సెప్టెంబర్ 4 జయ జయహే**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిని అందుకే పంచాయతీరాజ్, అటవీ శాఖ, పర్యావరణ శాఖలను ఎంచుకున్నారని దాని ద్వారా ఒక సేవలు అందిస్తున్నారని విశ్రాంతి విసి ముర్రు ముత్యాల నాయుడు చెప్పారు. శుక్రవారం మాడుగుల కోట బయలు ఆవరణలో జనసేనని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముత్యాలనాయుడు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పవన్ కళ్యాణ్ కు అతిముఖ్యమైన మంత్రి పదవులు చంద్రబాబు నాయుడు ఆఫర్ ఇచ్చినప్పటికీ వాటిని కాదని పంచాయతీరాజ్ అటవీ శాఖ పర్యవనం శాఖలు ఎంచుకున్నారని చెప్పారు. వీటి ద్వారా మహాత్మా గాంధీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించాలన్న ఉద్దేశంతో ఈ ఈ శాఖలో చేపట్టారన్నారు ఇప్పటికే ఆయన చేపట్టిన శాఖల ద్వారా అనేక సత్ఫలితాలు వస్తున్నాయని, గ్రామపంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుందని చెప్పారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్న కొత్త సర్పంచులకు పవన్ తీసుకుంటున్న చర్యలు ఎంతో ఊరట ఇస్తాయని చెప్పారు. పవన్ ఆశయాల సాధనకు ప్రతి జనసేనని కృషి చేయాలని చెప్పారు. అలాగే సమాజ సేవకులను ఎవరు గుర్తించరని అలాంటి పరిస్థితుల్లో రబ్బా మహేష్ సమాజానికి సేవలు అందిస్తున్న పత్రిక విలేకరులను పారిశుద్ధ్య కార్మికులను, విఆర్వీలను వీఆర్ఏలను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న మరో అతిథి మార్కెట్ కమిటీ చైర్మన్ పి అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కూడా అత్తకు సహకారం అందిస్తుందని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో పార్కు సత్యం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి ఎస్ ప్రసాద్ తో పాటు బిజెపి నాయకులు వడ్డాది వరలక్ష్మి, కూడా వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు జి శివాజీ, సురేఖ, కోన శ్రీను, కొండలరావు,, శ్రీరామ్, ఎస్ రమేష్, జీవి మూర్తి, రామ్మూర్తి నాయుడు, భార్గవి, వీరవిల్లి పిఏసిఎస్ అధ్యక్షుడు ఎస్ రమేష్, కొన్ని శంకర్, కే సంతోష్, దాసరి అచ్యుతరావు తోపాటు మాడుగుల మండలంలో గల అనేకమంది జనసైనికులు వీర మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్రిక విలేకరులను, పలువురు జనసైనికులను, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న విఆర్వి వీఆర్ఏలను సాలువులతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు రోబ్బ మహేష్ ను పలువురు ప్రశంసించారు.

## ఇద్దరు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

**మాడుగుల సెప్టెంబర్ 4, జయ జయహే**

మాడుగుల మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు స్త్రఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈఓ బి దేవుడమ్మ తెలిపారు. వారిలో వీరనారాయణ హై స్కూల్ స్కూల్ అసిస్టెంట్ పార్థసారథి, పోతనపూడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అపర్ణ గాయత్రి ఉన్నారన్నారు. వీరిద్దరికి ఈనెల 5న జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందజేస్తారని తెలిపారు.








## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు .

### ఉత్సాహంగా సాగిన ఉట్టికొట్టే కార్యక్రమం

**జయ జయహే - ఓజిలి**

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఓజిలిలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి నామస్మరణతో పరిసరాలు భక్తిమయంగా మారాయి. చిన్నారులు, యువతీ యువకులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. కృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. ఉట్టి కొట్టేందుకు ప్రయత్నించిన యువతను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలు పరస్పరం కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కృష్ణాష్టమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులుపాడి వెంకటసుబ్బయ్య యాదవ్, ఓజిలి యూత్ పాల్గొన్నారు.

## రాధాదేవిగా శతకం పట్టు కనకదుర్గ దేవి



అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయములో ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాంత్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి సౌజన్యంతో శ్రావణమాసం నాలుగో శుక్రవారం, కృష్ణాష్టమి సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కె హరి నారాయణ, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అమ్మవారికి రాధాదేవిగా విశేషాలంకరణ చేశారు. అధిక సంచులు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ కమిటీ సభ్యులు , శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్,తదితరులు పాల్గొన్నారు.

## పసుపుకొమ్ములతో అలంకారమై ఉన్న నోకాంబిక అమ్మవారు

**అనకాపల్లి జయ జయహే**



శ్రావణమాసం నాలుగోవ శుక్రవారం సందర్భంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దైవమైన అనకాపల్లి లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ నూకంబిక అమ్మవారి కి వైభవంగా శుక్రవారం పసుపు కొమ్ములతో అలంకారం చేయడం జరిగింది అలాగే అమ్మవారు ముఖమండపంలో సామూహిక కుంకుమ పూజలు కూడా నిర్వహించడం జరిగింది అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించి కుంకుమ పూజలో పాల్గొనడం జరిగింది వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది . దేవాలయం చైర్మన్ పీల నాగ శ్రీను (గొల్ల బాబు) ఈవో వై శ్రీధర్ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది

# గొడ్డలి పార్టీ అధినేత అమర్నాథ్ వ్యాఖ్యలు అర్ధ రహితం

**జయ జయహే**




పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర గోదావరి జలాలు అందించే విషయంలో గొడ్డలి పార్టీ నేత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి బుద్ధ నాగ జగదీష్ ఖండించారు శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం మాజీ మంత్రి తగదని ఆయన అన్నారు పోలవరం పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నా కోడిగుడ్డు మాజీ మంత్రి అమర్నాథ్ కి పోలవరం సాధనకు చంద్రన్న చేసిన కృషి గొడ్డలి పార్టీ నేత అమర్నాథ్ కి కనిపించలేదా? కోడిగుడ్ల కబుర్లు చెప్తే చోడవరం ప్రజలు కూడా వెంటపడతారు జాగ్రత్త దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు గోదావరి జలాలను కాలువ ద్వారా అందించే ప్రక్రియ ముందుకు సాగుతూ ఉంటే దానిని కూడా రాజకీయం చేయడం దురదృష్టకరమని గత ప్రభుత్వ హాయంలో పోలవరం ప్రాజెక్టు పనులు ఏ స్థాయిలో సాగాయో ప్రజలకు తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు అభివృద్ధిని అడ్డుకోవద్దు పోలవరం ఎడమ కాలువ పనులు అనుసంధాన వ్యవస్థ పై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ను స్వాగతించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదని ఆయన అన్నారు ఉత్తరాంధ్ర సాగు తాగునీటి అవసరాలకు తీర్చే ప్రాజెక్టు ల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుందని ఆయన అన్నారు ఎత్తిపోతల పథకాలు కాలువల ద్వారా నేటి సరఫరా వంటి అంశాలను సాంకేతికంగా పరిశీలించకుండా రాజకీయ కోణంలో మాట్లాడటం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన అన్నారు పోలవరం సాధన కోసం అనునిత్యం శ్రమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రమ కృషి ఈ గొడ్డలి పార్టీ నేతల కళ్ళకు కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు అమర్నాథ్ కోడిగుడ్డు మేనేజ్మెంట్ కబుర్లు తెలిసే సొంత నియోజకవర్గం గాజువాక ప్రజలు తరిమికొట్టారని ఆయన ఎద్దేవా చేశారు ఇప్పటికీ అయిన అదే ధోరణిలో కోడిగుడ్డు కబుర్లు చెప్తే చోడవరం నియోజకవర్గ ప్రజలు కూడా తరిమి కొడతారని ఆయన హెచ్చరించారు జగన్ పాలనలో మీరు ఏం చేశారు చంద్రబాబు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న అమర్నాథ్ గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ పాలనలో ఉత్తరాంధ్ర ఎన్ని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేశారు చెప్పాలని జగదీశ్వర్ రావు డిమాండ్ చేశారు పోలవరం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో గత ప్రభుత్వం అనుసరించిన వైఖరిని ప్రజలు ఇప్పటికే మర్చి పోలేక పోతున్నారని ఇప్పుడు ప్రాజెక్టు పనులు కాలువల నిర్మాణం వేగం పుంజుకోవడంతో గొడ్డలి పార్టీ నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు వస్తూ ఉంటే ఈ గొడ్డలి పార్టీ నాయకులు వార్వలేకపోతున్నారని ఆయన ఆరోపించారు గోదావరి జలాల ఇంకా ఊర్లకు రాకముందే వీళ్ళ కళ్ళంట కన్నీళ్లు జలాలు ప్రారంభమయ్యాయి అని ఆయన ఎద్దేవా చేశారు గోదావరి జలాలు రావడం ఈ ప్రాంత రైతులకు శుభపరిణామం అని నేటి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వానికి సహకరించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై ఉందన్నారు ప్రజలకు నీరు అందించే ప్రతి ప్రయత్నాన్ని అడ్డుకునేలా వ్యక్తులు చేయడం తగదని ఆయన హితవు పలికారు పోలవరం పేరుతో తప్పుడు ప్రచారం చేస్తు విమర్శిస్తున్న అమర్నాథ్ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రకు కలిగే ప్రయోజనాలు ప్రజలకు వివరించాలని జగదీష్ రావు సూచించారు రాష్ట్ర అభివృద్ధి సాగునీటి ప్రాజెక్టు నిర్మాణమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యము అని ఆయన పేర్కొన్నరు గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులు పునః ప్రారంభించి ముందుకు తీసుకెళుతున్నామని రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా నిర్మాణాత్మక సూచనలు చేయాలని మాజీ మంత్రి అమర్నాథ్ కు సూచించారు లేకుంటే ప్రజలు రైతులు బుద్ధి చెప్పే పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు ఇప్పటికైనా కోడుగుడ్డు మాటల మనిషిగా కాకుండా చేతల మనిషిగా మారాలని ఆయన సూచించారు పోలవరం ప్రాజెక్టు పనులన్ని పక్కాగా పూర్తిచేసి ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు అందే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కుప్పిలి జగన్మోహన్ తెలుగుదేశం సీనియర్ నాయకుడు బోడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా నవరాత్రి ఉత్సవాలకు రాట

**చోడవరం : సెప్టెంబరు 4, జయ జయహే**

చోడవరం మండలంలోని పి.ఎస్.పేట బ్రాహ్మణ వీధిలో వేంచేసియున్న శ్రీ లక్ష్మి గణపతి స్వామి దేవస్థానంలో రానున్న గణపతి నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు సంబంధించి ఆలయ చైర్మన్ పుట్రేవు శ్యాం ప్రసాద్ దంపతుల చేతుల మీదుగా శుక్రవారం రాట సుముహూర్తం చేశారు. శ్రావణ బహుళ అష్టమి శుక్రవారం ఉదయం గం. 10:32 ని. లకు అత్యంత భక్తిశ్రద్ధలతో, వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ లక్ష్మీ గణనాథుని కృపతో ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా, వైభవంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ ఫకీర్ సాహెబ్ పేట బ్రాహ్మణ వీధిలో సుమారు 135 సంవత్సరాల నుండి శ్రీ లక్ష్మీ గణపతి స్వామి కొలువుదీరి, ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన క్షేత్రంగా విరాజిల్లుతున్నదని తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలకు విశాఖ, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల నుండే కాక దేశ విదేశాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చి లక్ష్మీ గణపతి ఉత్సవాల్లో పాల్గొంటారని తెలియజేశారు. నవరాత్రుల్లో ప్రతిరోజు వేకువజామునే లక్ష్మీ గణపతి హోమం, గణపతి దీక్ష భక్తులకు నిత్య అన్న సమారాధనలు, పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ లక్ష్మీ గణనాథుని ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత రెవెన్యూ అధికారి డి.వి.కె. శ్రీనివాస్, ధన్యంరాజు సీతారామశీ, దస్తావేజు లేఖరుల సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది రమేష్ , గోటేటి సీతా రామయ్య, సూర్య నారాయణ మూర్తి, అర్చకులు ఆరెవెల్లి నరసింహాచార్యులు, శేషా చార్యులు, గోవిందా చార్యులు, సీతారామ డ్వాక్రా మహిళలు, వైష్ణవి డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



### జగన్ రెడ్డిది ధనయజ్ఞం...

## చంద్రబాబుది ప్రజా యజ్ఞం

**టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య**

**గుంటూరు, సెప్టెంబర్ 4, జయ జయహే**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ క్రెడిట్ చోరీ పద్ధతులను, తప్పుడు ప్రచారాలను మానుకోవాలని గుంటూరు జిల్లా టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు, జలయజ్ఞం పేరుతో మాజీ సీఎంలు వైఎస్, జగన్మోహన్ రెడ్డి లు చేసింది కేవలం ధన యజ్ఞం అయితే ప్రస్తుత సీఎం చంద్రబాబు మాత్రం తడారిన ప్రజల గొంతు తడిపే ప్రజా యజ్ఞంగా పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డిల కన్నా భారీ ఎత్తున నిధులు కేటాయించి రికార్డు స్థాయిలో నీళ్లు వదిలిన సీఎంగా చంద్రబాబు రికార్డులకెక్కారని పేర్కొన్నారు. కూటమి సర్కార్ రికార్డు స్థాయిలో 2250 కోట్లు ఖర్చు చేసి నీటి ప్రాజెక్టు పనులు శర వేగంగా పరుగులు పెట్టించిన సీఎంగా చంద్రబాబు చరిత్రకెక్కారని కొనియాడారు. నిర్వాసితుల పరిహారంగా రూ. 903 కోట్లు అందించి అభాగ్యుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించిన మహానుభావునిగా కీర్తి కెక్కారని పేర్కొన్నారు. జగన్, రాజశేఖర్ రెడ్డిల హయాంలో జరిగిన అభివృద్ధి కన్నా మెరుగైన ఫలితాలిచ్చే అభివృద్ధి కళ్ల ముందు సాక్షాత్కరించిన సీఎం చంద్రబాబేనని గుర్తు చేశారు. ఎల్నినో ప్రభావంతో కరువు తాండవిస్తున్న రోజుల్లో ఉత్తరాంధ్రను శశ్య శ్యామలం చేసేందుకు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టడం ఆయన విజనరీకి సెల్యూట్ చేయాల్సిందేనని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు.



### మానసిక వికలాంగులకు

## న్యూట్రెక్షన్ స్నాక్స్ పంపిణి

**భీమవరం : (జయ జయహే )**

అభాగ్యులతో పండుగలు నిర్వహించడం మానవ ధర్మమని, మన ఇంట జరిగే శుభకార్యాలను అభాగ్యుల మధ్య జరుపుకుంటే వారిలో మానసిక స్థైర్యం వస్తుందని భీమవరం ఫెమినా లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డా ఐశ్వర్య, డా ప్రీతి, భీమవరం లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోపిశెట్టి మురళి అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ 3వ ఉపాధ్యక్ష ఎండార్సీ లయన్ విజయకుమార్ రాజు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం భీమవరంలోని మానసిక వికలాంగుల స్కూల్లో చిన్నారులకు న్యూట్రెక్షన్ స్నాక్స్ ను పంపిణి చేశారు. అదే విధంగా రతన్ టాటా వీధిలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. పేదవారికి ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం దైవ కార్యక్రమంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో ఆరవ ప్రసాద్, కనగర్ల రామకృష్ణ, తాళ్ళూరి త్రివిక్రమరావు,గమిని రవి, నడింపల్లి మహేష్, బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు






## శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో గోమాతకు ఘనంగా పూజలు

**గోసేవయే గోవిందుడి సేవ --- ధార్మిక చైతన్యానికి గోపూజ దోహదం**

**కర్నూలు, సెప్టెంబర్ 4:( జయ జయహే )**

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగర శివారులో వెలసిన శ్రీగోదాగోకులం నందు గోపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోమాతను ప్రత్యేకంగా అలంకరించి, పసుపు, కుంకుమలతో పూజించి, వస్త్రం, పుష్పమాలలు సమర్పించారు. తిరునగరి రమేషాచార్యులు, వేదపండితులు వరయూరు కిరణ్ కుమారాచార్యులు, లక్ష్మీనారాయణాచార్యులు, మహేషాచార్యులు, పద్మనారాయణలు వేదమంత్రోచ్ఛారణల మధ్య గోమాతకు హారతి ఇచ్చి, భక్తులతో గోప్రదక్షిణలు నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ, భారతీయ సనాతన ధర్మంలో గోవుకు అత్యంత విశిష్టమైన స్థానం ఉన్నదని తెలిపారు. శ్రీకృష్ణుడు గోపాలుడిగా గోవులతో అనుబంధాన్ని కలిగి ఉన్నందున శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గోపూజ నిర్వహించడం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని పేర్కొన్నారు. గోసేవ, గోపూజ ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల భక్తిభావం పెంపొందడంతో పాటు, ధార్మిక చైతన్యం మరియు సేవాభావం ప్రజల్లో మరింతగా వికసిస్తాయని తెలిపారు. నేటి తరానికి సనాతన ధర్మంలోని విలువలను తెలియజేయడం, ఆచార వ్యవహారాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక చైతన్యం, భక్తి, సత్సంగాలు, భజనలు, పూజా కార్యక్రమాలు మరియు సనాతన ధర్మ ప్రచార కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రష్టీ పల్లెర్ల నాగరాజు, తుమ్మేపల్లి శ్రీనివాసరావు, పాలాది సుబ్రహ్మణ్యం, వేముల జనార్దన్, పెరుమాళ్ళ బాలసుధాకర్, భూమా కృష్ణ మోహన్, లింగం రవి, లింగం కృష్ణయ్యశ్రేష్ఠి, తల్లం సురేష్, మాకం శ్రీనివాస్, నూకల గిరిబాబు, జి. రాధాకృష్ణ, ఇ. పుల్లయ్య పెద్ద సంఖ్యలో గోదాపరివార్ మహిళలు, భక్తులు పాల్గొని గోమాత ఆశీస్సులు పొందారు. కుంకుమార్చన, ఊంజల్ సేవ, పల్లకి సేవ, ఉట్టికొట్టేకార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల బాలకృష్ణుల వేషధారణలు భక్తులను ముచ్చట గొలిపాయి. గోపూజ అనంతరం భక్తులందరికీ మహా ప్రసాద వితరణ చేశారు.

# సీఎంతో భేటీకి ఆహ్వానించకపోవడం దారుణం

**- ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షులు అరవ పాల్**

**- ఉద్యోగులందరి సమస్యలు వినాలి....**
**ఏ ఉద్యోగి గొంతు నొక్కొద్దు..!**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 4, జయ జయహే**

ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి భేటీకి మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల సంఘమైన తమను విస్మరించడం బాధాకరమని ఏపీ హంస రాష్ట్ర అధ్యక్షులు అరవ పాల్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని అయితే ఉద్యోగుల సమస్యలను నేరుగా సంఘాల ప్రతినిధులతో చర్చించి పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు రావడం మంచి శుభసూచకంగా భావిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూల చర్చ జరిగి, ప్రభుత్వం ఉద్యోగులు ఆశించిన మేరకు అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. అయితే ఈ సమావేశానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఆహ్వాన జాబితా పరిశీలిస్తే మాత్రం తమను ఆందోళనతో పాటు తీవ్ర అసంతృప్తికి కారణవవుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన సేవా సంఘాల ప్రతినిధులను సమావేశానికి ఆహ్వానించినప్పటికీ, జాబితాలో ప్రధానంగా ఉపాధ్యాయ, రెవెన్యూ, రవాణా తదితర శాఖలకు చెందిన సంఘాలే కనిపిస్తున్నాయని, లక్షలాది మంది ఉద్యోగులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది, ఇతర ఆరోగ్యశాఖ సిబ్బందితో కూడిన మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్కు చెందిన గుర్తింపు పొందిన ఉద్యోగుల సంఘానికి ఈ సమావేశంలో అవకాశం కల్పించకపోవడం వెనుక గల కారణాలేంటో అనే ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో ఉత్పన్నమవుతోందని తెలిపారు. ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులకు సంబంధించిన అనేక కీలక సమస్యలు, క్యాడర్ సమస్యలు, పోస్టుల సర్దుబాటు, బదిలీలు, పదోన్నతులు, సర్వీస్ సమస్యలు, సిబ్బంది కొరత, పని భారం తదితర అంశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఉద్యోగుల సమస్యలపై నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని తాము స్వాగతిస్తున్నప్పటికీ, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్కు చెందిన గుర్తింపు పొందిన ఉద్యోగుల సంఘాన్ని చర్చలకు ఆహ్వానించకపోవడం పట్ల తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునఃపరిశీలించి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నామని కోరారు. "ప్రభుత్వం ఉద్యోగులందరి సమస్యలు వినాలి ఏ శాఖ ఉద్యోగుల గొంతుకను విస్మరించకూడదు" అన్నదే మా ప్రధాన అభిప్రాయంగా తెలిపారు.

## స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు

**మునగపాక, సెప్టెంబర్ 4, జయ జయహే:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన సందర్భంగా నర్సీపట్నంలోని ఆయన స్వగృహంలో భారీ గజమాలతో మునగపాక మండల టిడిపి నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెంటకోట విజయ్, పెంటకోట స్వాతి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, అధికారి ప్రతినిధి ఆడారి జానకి, టిడిపి రాష్ట్ర నాయకులు కర్రి సాయికృష్ణ, ఆడారి కన్నబాబు, మల్ల వరహా నర్సింగరావు, పెంటకోట శ్రీరామ్ మూర్తి, శివ, వుల్లింగుల గోవింద తదితరులు ఉన్నారు.

# తెలుగు సాహిత్య విమర్శకు ప్రథమ ఆచార్యులు డాక్టర్ కట్టమంచి

### మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్యనాయుడు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 4, జయ జయహే**




ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన "అభినవ విమర్శకు మార్గదర్శి కట్టమంచి" అనే గ్రంథాన్ని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. తిమ్మాపురం విజ్ఞాన్ స్కూల్లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన మంచి గ్రంథాన్ని ఆవిష్కరించడం శుభపరిణామమన్నారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం కావడానికి డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి చేసిన సేవలు అమోఘం, అద్వితీయం అని అన్నారు. సిమ్మన్న సింహం.సిమ్మన్న సాహిత్య సింహంలా మాట్లాడారు .అలాగే కట్టమంచి రామలింగారెడ్డి విమర్శ గ్రంథం ఉంది. శాస్త్రీయంగా, హేతుబద్ధంగా, ప్రామాణికంగా సిమ్మన్న ఈ విమర్శ గ్రంథం రాశారు.వారికి అభినందనలు. సిమ్మన్న రాసిన ఈ గ్రంథము భావితరాలవారికి ఉపయోగపడుతుందని, తెలుగు భాషను కాపాడుకోవాల్సినటువంటి అవసరం అందరి మీద ఉ ందన్నారు. తెలుగు భాష చాలా గొప్ప భాషని చాలా విశిష్ట భాష ఈ భాషను అందరము నేర్చుకొని తెలుగు భాషకు గౌరవాన్ని కల్పించాలి అని అన్నారు. కట్ట మంచివారు చరిత్రలో నిలిచిపోయినటువంటి మహనీయులు అని వెంకయ్య నాయుడు అన్నారు . సభాధ్యక్షత వహించిన ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ సిమ్మన్న గ్రంథాలు వివిధ పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ గ్రంథము కూడా చాలా ప్రామాణికమైనదని, సిమ్మన్న వందో గ్రంథం ఇదన్నారు. విజ్ఞాన విద్యాసంస్థలు ప్రతినెల తప్పనిసరిగా భాష సాహిత్యానికి సంబంధించి ఒక ఉపన్యాసం మీరు ఏర్పాటు చేయాలని, ఎందుకంటే మీ విద్యార్థులకి భాష మీద సాహిత్యం మీద పట్టు సాధించాలంటే ప్రతి నెల ఒక ఉపన్యాసము పెట్టి వాళ్లకు భాషపై, సాహిత్యపై మక్కువ పెరిగేటట్టు చూడాలి అని ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. విజ్ఞాన విద్యాసంస్థల సీఈవో శ్రీకాంత్ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా సిమ్మన్న రాసిన పుస్తకము ఆవిష్కరణ అవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని, మా విద్యార్థులకి మీ ఉపన్యాసాలు ఎంతో స్ఫూర్తిని ప్రేరణ కలుగ చేస్తాయన్నారు. ఏయ తెలుగు శాఖాధిపతి ఆచార్య జెర్రా అప్పారావు మాట్లాడుతూ కట్టమంచి రామలింగారెడ్డి వలన ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు అత్యున్నతమైనటువంటి స్థాయికి చేరుకుందన్నార

# గుడ్ న్యూస్ ప్రేయర్ హౌస్‌లో కండవల్లి జోషి వర్ధంతి కార్యక్రమం





### ముఖ్య అతిథిగా బొల్లవరపు జాన్ వెస్లీ

**తూర్పుగోదావరి (జయ జయహే) ,**

నిడదవోలు. గుడ్ న్యూస్ ప్రేయర్ హౌస్ లో కండవల్లి జోషి వర్ధంతి కార్యక్రమం జెకె ఫౌండేషన్ అధినేత కండవల్లి రాబిన్ పాల్ ఆధ్వర్యంలోనిర్వహించారు . ఈ కార్యక్రమానికి బిషప్ గుణ శామ్యూల్ అధ్యక్షత వహించారు . ముందుగా పాస్టర్ ప్రసాద్ అతిథులను ఆహ్వానిస్తూ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. బిషప్ గుణ శామ్యూల్ మాట్లాడుతూ క్రైస్తవ్యం అంటేనే లోకానికి ఎదురెదుడమని అలాంటి ఈ సమాజంలో నీతిగా నిజాయితీగా ఉంటూ ప్రజలకు నిజమైన సేవను అందించిన జోషి ఎంతో అభినందనీయులని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ స్వర్గీయ జోషి చేసిన సేవలను గుర్తు చేశారు.స్కూల్ ఆఫ్ ఎవాంజెలిస్మ్ ద్వారా ఎంతోమంది పాస్టర్స్ ను ఈ జిల్లాలో దైవ సేవకులుగా అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరికి ఏ సహాయము అవసరమైన ముందుండి సహాయ సహకారాలు అందించే వారిని చెప్పారు. నిజమైన దైవజనుడు గా నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించమని ఏసుప్రభు చెప్పిన మాటలను ఆచరించిన ధన్యజీవి అని అన్నారు . ఎంతోమంది ఇబ్బందులలో ఉన్నపేద విద్యార్థులను చదివించి ప్రయోజకులను చేయడం జరిగిందని తెలియజేశారు. మన మధ్యలో లేకపోయినా ఈరోజు మనందరం జ్ఞాపకం చేసుకుంటున్నాం అంటే అందుకు కారణం ఆయన చేసిన మంచి పనులే అని చెప్పారు. జెకె ఫౌండేషన్ ద్వారా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో దేవుని సేవ జరుగుతున్నదంటే దానికి ముఖ్య కారణం జోషి తనయుడు సహోదరుడు రాబిన్ పాల్ ఎంతైనా అభినందనీయులని తెలియజేశారు. అనంతరం కేజే ఫౌండేషన్ అధినేత రాబిన్ పాల్ మాట్లాడుతూ మా తండ్రిగారైన స్వర్గీయ జోషి మమ్మల్ని నిజమైన క్రైస్తవులుగా అందరికీ మార్గదర్శకంగా ఉండే విధంగా పెంచారని తెలియజేశారు. మేము ఇంత ఉ న్నతమైన స్థానంలో ఉన్నామంటే దానికి కారణం మా తల్లిదండ్రులు చేసిన మంచి పనులే అని తెలియజేశారు. సభ అనంతరం ఈ కార్యక్రమానికి విచ్చేసిన దైవ సేవకులు అందరికీ సహాయం చేయడం జరిగింది అనంతరం ప్రేమ విందు ఏర్పాటు చేసారు .ఈ కార్యక్రమంలో నీలి రాజు జోష్ణ సందీప్ ప్రియాంక పాస్టర్ రామ్మోహన్ పాస్టర్ కర్నూల్ అధిక సంఖ్యలో పాస్టర్లు క్రైస్తవ నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు .

# ఆకట్టుకున్న హాస్య నాటిక ప్రదర్శన

**విశాఖపట్నం, సెప్టెంబర్ 4, జయ జయహే :**



విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి ప్రతీ నెల మొదటి శుక్రవారం నిర్వహించే నాటికల ప్రదర్శనలో భాగంగా ఒక హాస్య నాటిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనకు ముందుగా అధ్యక్షులు ఎం ఎస్ రాజు, కార్యదర్శి శ్రీరామదాస డాక్టర్ రాంబాబు, లీడర్ పత్రిక అధినేత రమణ మూర్తి, చలసాని కృష్ణ ప్రసాద్, డాక్టర్ కేజీ వేణు నర్సింగరావు , రమణమూర్తి అండ్ పాత్రుడు తదితరులు హాజరై జ్యోతి ప్రకాశం చేసి సుభారంభం చేశారు. శ్రీ సాయి నట సమాఖ్య విశాఖపట్నం వారు ప్రదర్శించిన "ఇంటి దొంగలు"నాటకం చాలా హాస్య భరితంగా జరిగింది. ఈ నాటిక చూసేందుకు అధికంగా వచ్చిన ప్రేక్షకులు అమితానందంతో చప్పట్లతో హర్షద్వానాలు తెలిపారు. నటీనటులందరూ క్రమశిక్షణతో వారి వారి పాత్రలలో జీవించి నటించారు. ఇటీవల కాలంలో ఆహ్లాదం కలిగించే మంచి హాస్య నాటిక చూసి చాలా కాలమైందని, అడుగడుగున హాస్యం పండించినందుకు ప్రేక్షకులు నట సమాఖ్య వారిని అభినందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కిందటి నెలలో కళాభారతి 40 సంవత్సరాలు పండగ సందర్భంగా ఆ రోజులు మెగా ఉత్సవం జరుపుకున్నామని ఈ నెలలో మన తదుపరి కార్యక్రమం తిరుపతి వాస్తవ్యురాలు ప్రముఖ గాయని శ్రీదేవి కర్ణాటక గాత్ర సంగీత కచేరి ఉ ంటుందని అలాగే 20వ తేదీన ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ కుమార్తె కుమారి సంస్కృతి గజల్ గాన కార్యక్రమం ఉంటుందని అందరూ విచ్చేసి ఆనందించవలసిందిగా కోరారు.



## వీ డెంటల్ కేర్‌లో ఘనంగా రమేష్ జన్మదిన వేడుకలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 4, జయ జయహే :**

వి హెల్త్ కేర్, వి డెంటల్ కేర్ డైరెక్టర్ కె.ఎం.కె. రమేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పలువురు ప్రముఖులు, వైద్యులు రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా వి డెంటల్ హాస్పిటల్లో జరిగిన వేడుకల్లో ఆయన పుట్టినరోజు కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. స్వర్ణలత, డాక్టర్ జయంతి, డాక్టర్ సందీప్, వి హెల్త్ కేర్ చీఫ్ మేనేజర్ సిహెచ్. కృష్ణ, వీడెంటల్ అడ్మిన్ మేనేజర్ సిహెచ్. పార్వతి, కార్పొరేట్ మేనేజర్ పృథ్వీరాజ్, రమ్య తదితరులు పాల్గొన్నారు. రమేష్ వ్యక్తిత్వం, సేవా స్ఫూర్తి పై తులసి, మేరీ రాసిన కవిత అందర్నీ ఆకట్టుకుంది.



## శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో అలరించిన విద్యార్థుల వేషధారణలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 4, జయ జయహే**

శ్రీ సత్య సాయి విద్యా విహార్‌లో భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తి పరవశంతో శ్రీ సత్యసాయి ప్రేమసదన్ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలపించిన ఆహ్లాదభరిత భజనలు ఆ ప్రాంగణాన్ని ఆధ్యాత్మికానందంతో నింపాయి. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సన్నాహాలు చేసిన చిన్నారులు పాఠశాల ప్రాంగణాన్ని ముద్దుతో, మాధుర్యంతో కళకళలాడించారు. ఆనందోత్సాహాలను మరింత పెంచుతూ, సీనియర్ విద్యార్థులు భక్తులతో కలిసి సంప్రదాయ ఉట్టి కొట్టడంతో వేడుకలకు ముగింపు పలికారు. ఈ కార్యక్రమం భక్తి, సాంప్రదాయం, యువ ఉత్సాహాల సమ్మేళనంగా అందరికీ మరపురాని అనుభూతిని అందించింది.



## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**మునగపాక, సెప్టెంబర్ 4, జయ జయహే:**

మునగపాక మండలంలోని మునగపాక, ఒంపోలు, వాడ్రాపల్లి, రామగిరి తదితర గ్రామాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మునగపాక, ఒంపోలులో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగాయి. ఒంపోలులో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు శంకర్, నరాలశెట్టి సూర్యనారాయణ, బోద్దపు శ్రీరామమూర్తి, బొడ్డేడ బుజ్జి, ద్వారం హరిబాబు, ఆడారి కాశి బాబు, శరగడం మణికంఠ, కాండ్రేగుల జగన్, శ్రీ కృష్ణ ఉ త్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మునగపాక, ఒంపోలు, అరబుపాలెం, నాగులాపల్లి తదితర గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి పూజలు చేసి, తీర్థప్రసాదాలు సేకరించారు.

## పల్లె చెరువులకు కొత్త కళ

**జయ జయహే:**

సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది. శ్రీ పవన్ కళ్యాణ్ గారి దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి.× చెరువులకు కొత్త రూపు.. ప్రజలకు కొత్త సౌకర్యాలుచెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు.



## డార్క్ చాక్లెట్ తినటం వల్ల
# ప్రయోజనాలు

డార్క్ చాక్లెట్ అంటే దాదాపు అందరికీ ఇష్టమే. ఈ చాక్లెట్ కోకో బీన్స్‌తో తయారు చేస్తారు. సాధారణ చాక్లెట్‌తో పోలిస్తే, డార్క్ చాక్లెట్ తినటం వల్ల ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు పోషకాహార నిపుణులు. డార్క్ చాక్లెట్‌లో ఐరన్, కాపర్, ఫ్లేవనాయిడ్స్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. చలికాలంలో డార్క్ చాక్లెట్ తినడం ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. అంతేకాదు.. గ్రీన్ టీ కంటే డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.. మంట, నొప్పిని తగ్గించడంలో డార్క్ చాక్లెట్ తీసుకోవడం ప్రయోజనకరంగా పనిచేస్తుంది. ఎంత యాంటీ ఆక్సిడెంట్లు తీసుకుంటే అన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. యాంటీఆక్సిడెంట్లను తీసుకోవడం ఒత్తిడిని తగ్గిస్తుంది. డార్క్ చాక్లెట్‌లో థియోబ్రోమిన్ అనే రసాయనం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. డార్క్ చాక్లెట్ శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది. డార్క్ చాక్లెట్ వార్మింగ్ ప్రభావాన్ని కలిగి ఉంటుంది. చల్లని వాతావరణంలో డార్క్ చాక్లెట్ తినటం వల్ల మీ శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. డార్క్ చాక్లెట్ ఆనందకరమైన రుచి మానసిక స్థితిని పెంచుతుంది. చల్లటి రోజులలో హాయిగా ఉంటుంది. చలికాలంలో జలుబు, దగ్గు సమస్య పెరుగుతుంది. దాన్ని తగ్గించుకోవడానికి డార్క్ చాక్లెట్ తినండి. డార్క్ చాక్లెట్‌లో థియోబ్రోమిన్ ఉంటుంది. ఈ మూలకం సహాయంతో, శ్వాసకోశ వ్యవస్థకు సంబంధించిన సమస్యలను తొలగించడంలో ఇది సహాయపడుతుంది. ఈ మూలకం సహాయంతో ఇది కాలానుగుణ ఇన్ఫెక్షన్లను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

డార్క్ చాక్లెట్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. కీళ్ల నొప్పులను తగ్గించడానికి యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్న ఆహారాలు మేలు చేస్తాయి. చలికాలంలో డార్క్ చాక్లెట్ తినడం వల్ల చర్మానికి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల కూడా  కిరణాల నుండి చర్మాన్ని రక్షిస్తుంది. డార్క్ చాక్లెట్ తినడం వల్ల వృద్ధాప్య ప్రభావాలను కూడా తగ్గించుకోవచ్చు.

## జుట్టు పెరగడానికి బెస్ట్ ఆప్షన్
# క్యారెట్ హెయిర్ మాస్క్





**క్యారెట్ తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. క్యారట్‌లో పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లు విటమిన్ ఏ, బి,సితో పాటు ఇతర పోషకాలు ఉంటాయి. క్యారెట్ ఆరోగ్యానికే కాదు జుట్టు సంరక్షణకు ఎంతో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకోసం మీరు చేయాల్సిందల్లా క్యారెట్‌తో కొన్ని పదార్థాలను కలిపి హెయిర్ మాస్క్ తయారు చేసుకుని వాడటమే. ఈ విధంగా క్యారెట్ హెయిర్ మాస్క్ వాడటం వల్ల ఏవైనా హేర్ ప్రాబ్లమ్స్ ఉన్నా కూడా తొలగిపోతాయి. జుట్టు ఒత్తుగా, పొడుగ్గా పెరుగుతుంది. ఇన్ని బెనిఫిట్స్ ఉన్న క్యారెట్ హెయిర్ మాస్కులు ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.**

**క్యారెట్, అవకాడో మాస్క్:**

క్యారెట్స్, అవకాడోలను సమంగా తీసుకుని వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై వీటిని మిక్సీలో వేసి మెత్తని పేస్టులాగా చేసుకోవాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని ఒక చిన్న బౌల్ లోకి తీసుకుని అందులో రెండు టేబుల్ స్పూన్ల తేనెను కలుపుకోవాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని స్కాల్ప్ నుంచి జుట్టు కుదుళ్ల వరకు అప్లై చేసి.. స్మూత్‌గా మసాజ్ చేసుకోవాలి. 15 నుంచి 20 నిమిషాల పాటు అలాగే ఉంచిన తర్వాత మైల్డ్ షాంపుతో తలస్నానం చేయాలి. పొడి జుట్టు ఉన్న వారు ఈ మాస్క్ వాడితే జుట్టు మృదువుగా తయారవడంతో పాటు ఒత్తుగా పెరుగుతుంది.

**క్యారెట్, ఆలివ్ ఆయిల్ మాస్క్:**

ఈ మాస్క్ జుట్టు పెరుగుదలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకోసం ముందుగా ఒక మీడియం సైజు ఉన్న క్యారెట్‌ను తీసుకుని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై వాటిని మిక్సీ జార్‌లో వేసి అందులో రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, నిమ్మరసం వేసి మెత్తని పేస్ట్‌లాగా చేసుకోవాలి. అనంతరం ఆ మిశ్రమాన్ని జుట్టుకు అప్లై చేసి అది ఆరే అంత వరకూ ఉంచుకోవాలి.



ఆ తర్వాత తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. 2017 జర్నల్ అఫ్ డెర్మటాలజికల్ సైన్స్‌లో ప్రచురితమైన ఒక నివేదిక ప్రకారం క్యారెట్‌లో ఉండే విటమిన్స్ స్కాల్ప్ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చుండ్రును తగ్గిస్తాయి. ఇందుకు సంబంధించిన పరిశోధన దక్షిణ కొరియాలోని సియోల్ యూనివర్సిటీలో జరిగింది. ఇందులో పాల్గొన్న డెర్మటాలజిస్టులు క్యారెట్ సంబంధిత హెయిర్ మాస్క్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయని వెల్లడించారు.

**క్యారెట్,ఎగ్ మాస్క్:**

ఈ హెయిర్ మాస్క్ కూడా జుట్టు రాలడాన్ని తగ్గించి వెంట్రుకలు బలంగా, ఒత్తుగా పెరగడానికి ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మాస్క్ కోసం ఒక క్యారెట్ ను తీసుకుని దానిని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై మిక్సీ జార్ తీసుకొని అందులో గుడ్డు పగులగొట్టి వేసుకోవాలి. దానిలోనే క్యారెట్ ముక్కలు , రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్ వేసి మిక్సీ పట్టుకోవాలి. ఆపై మిశ్రమాన్ని తలకు అప్లై చేసి అరగంట తర్వాత వాష్ చేసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

**క్యారెట్, కొబ్బరి పాల మాస్క్:**

ఈ మాస్క్ కోసం ముందుగా ఒక క్యారెట్ తీసుకుని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఆపై వాటిని మిక్సీలో వేసి జ్యూస్ పట్టుకొని దాని నుంచి రసాన్ని ఒక బౌల్‌లో ఫిల్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత దానిలో పావు కప్పు కొబ్బరిపాలను కూడా కలుపుకోవాలి. అనంతరం కాటన్ బాల్ సహాయంతో ఈ మిశ్రమాన్ని జుట్టు మొత్తానికి అప్లై చేయాలి. అరగంట పాటు అలాగే ఉంచి ఆపై షాంపుతో తలస్నానం చేయాలి. ఇది జుట్టు డ్యామేజ్‌ను తగ్గించి జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి ఉపయోగపడుతుంది. అంతే కాకుండా జుట్టు బాగా పెరగడానికి ఉపయోగపడుతుంది.

# మెరిసే చర్మం కోసం ఆరోగ్యకరమైన అలవాట్లు



నటీమణులను చూసి మీరు కూడా ఇలాగే ఆలోచిస్తారా?.. నాకు కూడా ఆమెలా మెరుస్తున్న చర్మం కలిగి ఉంటే బాగుండేదని. అవును అయితే, ఈ రోజు మనం అటువంటి మెరిసే చర్మాన్ని పొందే రహస్యాన్ని మీకు చెప్పబోతున్నాము. దీని కోసం మీరు ఎటువంటి ఖరీదైన చర్మ సంరక్షణ ఉత్పత్తికి డబ్బు ఖర్చు చేయనవసరం లేదు లేదా ఖరీదైన ఫేషియల్ చేయించుకోవలసిన అవసరం ఉండదు. మెరిసే చర్మం కలిగి ఉండాలంటే చర్మ సంరక్షణ లేదా మేకప్ మాత్రమే చేయాల్సిన అవసరం లేదు. మీ రోజువారీ అలవాట్లు మీ చర్మాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. కాబట్టి, మీ చర్మానికి మేలు చేసే కొన్ని అలవాట్లను మీ జీవనశైలిలో చేర్చుకోవాలి.

మెరిసే చర్మం కోసం ఆరోగ్యకరమైన అలవాట్లు

వ్యాయామం-ప్రతిరోజూ కొంత సమయం పాటు వ్యాయామం చేయడం వల్ల మీ చర్మానికి చాలా మేలు జరుగుతుంది. ఇలా చేయడం వల్ల చర్మంలోని మురికి చెమట ద్వారా బయటకు వచ్చి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల చర్మం మెరుస్తూ కనిపిస్తుంది.

సమయానికి నిద్రించండి-మీ రోజువారీ నిద్ర, మేల్కొనే సమయాన్ని నిర్ణయించుకుని దానిని అనుసరించండి. సెలవుల్లో కూడా ఒకే సమయంలో నిద్రించడానికి, మేల్కొలపడానికి ప్రయత్నించండి. ఇది మీ నిద్రను కూడా నిర్ధారిస్తుంది. మీ శరీరం సిర్కాడియన్ రిథమ్ నిర్వహించబడుతుంది. ఇలా చేయడం వల్ల చర్మం మెరుస్తుంది. మొటిమలు తగ్గుతాయి.

ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినండి- మన ఆహారం మన చర్మంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. కాబట్టి మీ ఆహారంలో పచ్చి కూరగాయలు, పండ్లు, పెరుగు, చేపలు మొదలైన వాటిని చేర్చుకోండి. మీ ఆహారంలో విటమిన్ సి, ఇ, ప్రొటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తప్పకుండా చేర్చుకోండి.

నీరు తాగండి-ప్రతిరోజూ సరైన మొత్తంలో నీరు తాగండి, తద్వారా మీ శరీరం డీహైడ్రేషన్ చెందదు. డీహైడ్రేషన్ కారణంగా మీ చర్మం పొడిగా, నిర్జీవంగా కనిపిస్తుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com